విశాఖపట్టణం
సోమవారం 10 ఆగస్టు 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com | సంపుటి: 9 | సంచిక:198 | వెల: రూ.5/- | పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool





3

## నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు

నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ సూర్యకాంత్‌ను పిలవొద్దని విద్యార్థుల డిమాండ్

# గిరిజనం కోసం సరికొత్త విధానం

త్వరలోనే రూపకల్పన చేస్తాం

అవకాశాలు ఇస్తే అద్భుతాలు సృష్టిస్తారు

గిరిజన బిడ్డలు మట్టిలో మాణిక్యాలు

అరకు కాఫీని గ్లోబల్ బ్రాండ్ చేసా

ఆదివాసీలకు న్యాయం చేసిన తొలి పార్టీ టీడీపీనే

సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు





(అమరావతి - జయజయహే)

అడవిని అమ్మగా ఆరాధించే గిరిజన బిడ్డలకు సరైన అవకాశాలు కల్పిస్తే వారు అద్భుతాలు చేయగలరని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆదివాసీలు ఉన్నతంగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని ఆయన స్పష్టం చేశారు. విజయవాడలో నేడు(శుక్రవారం) జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనుల అభివృద్ధి, సంక్షేమంపై ఆయన కీలక ప్రకటనలు చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు వచ్చిన సీఎం చంద్రబాబుకు అడవి బిడ్డలు ఘన స్వాగతం పలికారు. కొమ్ము, బంజారా, థింసా నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా సీఎం ఉత్సాహంగా డప్పు కొట్టారు. గిరిజన బాలికలతో కలిసి కాసేపు నృత్యం చేసి వారిలో ఉత్సాహం నింపారు. అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ అధికారులు పలు వివిధ ప్రైవేటు సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్నారు. వేలాది ఏళ్లుగా ఆదివాసీలు తమ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్నారని సీఎం కొనియాడారు. ఓ సామాన్య కుటుంబంలో పుట్టి దేశ ప్రథమ పౌరురాలిగా ఎదిగిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం అందరికీ ఆదర్శమని అన్నారు. అరకు కాఫీని ప్రభుత్వం ప్రోత్సహించి ప్రపంచస్థాయికి తీసుకెళ్తోందని చెప్పారు. పార్లమెంట్‌లోనూ అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేయించామని గుర్తుచేశారు. దీని రుచి ..మిగతా 2లో




## 17 నుంచి అసెంబ్లీ


4 రోజుల పాటు నిర్వహణ

కీలక బిల్లులు, ప్రజా సమస్యలపై చర్చ

అమరావతి - జయజయహే)

శాసనసభ వర్షాకాల సమావేశాల నిర్వహణకు రంగం సిద్ధమైంది. సమావేశాల ప్రారంభ తేదీలను ఖరారు చేస్తూ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం.... ఈ నెల 17వ తేదీ ఉదయం 9 గంటలకు శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతాయి. అలాగే ఉదయం 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రజా సమస్యలు, రాష్ట్ర అభివృద్ధిపై చర్చించేందుకు ఉభయ సభలు సిద్ధమవుతున్నాయి. సమావేశాలను ఎన్ని రోజుల పాటు నిర్వహించాలనే అంశంపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) కీలక నిర్ణయం తీసుకోనుంది. సమావేశాలు ప్రారంభమయ్యే ముందు రోజే లేదా తొలి రోజు ఉదయాన్నే ఉభయ సభల బీఏసీ సమావేశమవుతుంది. సభ నిర్వహణ... అజెండాను ఈ కమిటీ ఖరారు చేయనుంది. ప్రాథమిక వివరాల ప్రకారం.... ఈ వర్షాకాల సమావేశాలను సుమారు 4 రోజుల పాటు ..మిగతా 2లో

# పార్లమెంట్‌కు ఆరు బిల్లులు



## ప్రవేశపెట్టేందుకు సిద్ధమైన కేంద్రం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా సోమవారం లోక్‌సభ, రాజ్యసభల్లో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. కేరళ పేరు మార్పు కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మారుస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టనున్నారు. వివిధ ట్రిబ్యునళ్ల చైర్‌పర్సన్లు, సభ్యుల నియామకాలు, సేవా నిబంధనలలో పారదర్శకత, స్వతంత్రతను పెంచేందుకు ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు చట్టసభల ముందుకు రానుంది. కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ దీనిని ప్రవేశపెడతారు. గనులు, ఖనిజాల అభివృద్ధి, క్రమబద్ధీకరణ చట్టం-1957కు సవరణలు ..మిగతా 2లో



## మెడికో ప్రియాంక మృతి

మృత్యువుతో పోరాడి తుదిశ్వాస

తాగుబోతుల పైశాచికానికి బలి

హత్యాయత్నం కేసుగా నమోదు

కఠినంగా శిక్షించాలన్న తండ్రి వెంకటేశ్

2

ఉత్తరాది నుంచి దక్షిణాది వరకు

## ఇకపై భారీ వర్షాలు కురిసే ఛాన్స్

అంచనా వేస్తున్న ఐఎండీ

ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశంలోని పలు రాష్ట్రాల్లో వరుణుడు మళ్లీ ఉగ్రరూపం దాల్చుతున్నాడు. సోమవారం హిమాచల్ ప్రదేశ్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ఆరెంజ్ అలర్ట్ జారీ అయినట్లు అధికారులు వెల్లడించారు. ఇక ఉత్తరాఖండ్, తూర్పు రాజస్థాన్, పశ్చిమ మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. అలాగే దేశంలోని మరికొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, తూర్పు రాజస్థాన్, పశ్చిమ మధ్యప్రదేశ్‌లలోని ..మిగతా 2లో



## దుబాయ్ కంటే గొప్పగా వైజాగ్

ఇంటర్నేషనల్ డెస్టినేషన్‌గా ఎదగాలి

విశాఖ నాకు చాలా.. చాలా స్పెషల్

ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు రావడం సంతోషం


పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ వ్యాఖ్యలు

AAA సినిమాస్ మల్టీప్లెక్స్ ప్రారంభం




(విశాఖపట్నం - జయజయహే)

పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ ప్రస్తుతం రాకా చిత్రీకరణలో బిజీగా ఉన్నారు. డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తున్న సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే తాజాగా విశాఖ పట్నంలో ˜˜˜ సినిమాస్ ఏర్పాటు చేశారు. ఆదివారం బన్నీ చేతుల మీదుగా˜˜˜ సిని మాస్ మల్టీప్లెక్స్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బన్నీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గంగోత్రి సినిమా రోజుల్లో వైజాగ్ రోడ్డుపై తనను ఎవరూ గుర్తుపట్టేవారు కాదని.. ఇప్పుడే అదే రోడ్డుపై నడవలేకపోతున్నానని అన్నారు. ప్రస్తుతం రాకా సినిమా షూటింగ్ ముంబైలో జరుగుతుం దని.. వైజాగ్ ప్రజల కోసమే ఈరోజు బ్రేక్ అడిగి వచ్చానని అన్నారు. అలాగే విశాఖపట్నం సమీపంలో కొత్త ప్రారంభమైన ఎయిర్ పోర్ట్ విషయంలో ..మిగతా 2లో



2

## జాబ్స్ కల్పనలో విశాఖ టాప్

మెట్రోలు దాటి భారత్‌లో కొత్త ఉద్యోగ కేంద్రాలు

# దుబాయ్ కంటే గొప్పగా వైజాగ్

**మొదటి పేజీ తరువాయి...**



ప్రశంసలు కురిపించారు. వైజాగ్ తనకెంతో ప్రత్యేకమైన నగరమని చెప్పారు. తన తొలి చిత్రం గంగోత్రి కాలం నుండి తాను వైజాగ్‌కు వస్తూనే ఉన్నానని, ఇక్కడ అనేక షూటింగ్‌లు, ఈవెంట్‌లలో పాల్గొన్నానని గుర్తు చేసుకున్నారు. "వైజాగ్ నాకు చాలా, చాలా స్పెషల్ ఊరు," అని ఆయన తెలిపారు. ఒకప్పుడు ఈ రోడ్లపై ఎవరూ గుర్తించకుండా స్వేచ్ఛగా నడిచేవాడినని, ఇప్పుడు అభిమానుల ఆదరణతో అది అసాధ్యమైందని పేర్కొంటూ, ఈ ప్రయాణం ఒక అద్భుతమని వివరించారు. ఆసియా సినిమాస్‌కు సంబంధించి, వైజాగ్‌లో ఒక పెద్ద మాల్‌లో తన పేరు మీద ఒక ప్రతిష్టాత్మక థియేటర్ వస్తుందని కలలో కూడా అనుకోలేదని అల్లు అర్జున్ తెలిపారు. ఇది తన కల నిజమైన క్షణమని, "ఇది ఒక కల కంటే ఎక్కువ," అని పేర్కొన్నారు. ఇన్‌ఆర్బిట్ మాల్‌ను వైజాగ్‌కు తీసుకువచ్చినందుకు ఇన్‌ఆర్బిట్ బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. మాల్ అనేది కేవలం వాణిజ్య సముదాయం కాదని, అది ఒక నగరం సంస్కృతిలో భాగమని, జ్ఞాపకాలు సృష్టించుకునే ప్రదేశమని వివరించారు. విశాఖపట్నంలో కొత్త ఎయిర్‌పోర్ట్ ప్రారంభం కావడం సంతోషంగా ఉందని.. ఇంటర్నేషనల్ డెస్టినేషన్‌లాగా , దుబాయ్ కంటే గొప్ప నగరంగా విశాఖ మారాలని అన్నారు.

ఆసియా సినిమాస్ ప్రారంభం పట్ల తాను అత్యంత గర్వపడుతున్నానని అల్లు అర్జున్ వెల్లడించారు. ఈ థియేటర్‌లో భారతదేశంలో మరెక్కడా అందుబాటులో లేని అత్యున్నత సాంకేతికత ఉందని, వైజాగ్ ప్రజలకు ఇది తమ అంకితమని తెలిపారు. ఈ థియేటర్‌ను కేవలం వినోద కేంద్రంగా కాకుండా, కుటుంబ సభ్యులతో, స్నేహితులతో గొప్ప జ్ఞాపకాలను సృష్టించుకునే ప్రదేశంగా చూడాలని ఆయన కోరారు. "చాలా ప్రేమ, శ్రద్ధ, ఆప్యాయతతో ప్రతి చిన్న విషయంలోనూ నిమగ్నమయ్యాం," అని వివరించారు. ఈ థియేటర్‌లోని ఒక స్క్రీన్‌కు వైల్డ్ ఫైర్ అని పేరు పెట్టినట్లు, ప్రతి స్క్రీన్‌ను వ్యక్తిగతంగా డిజైన్ చేసినట్లు ఆయన తెలిపారు. వైజాగ్ ప్రజలు ఎప్పుడూ తనను ఆశీర్వదించారని, భవిష్యత్తులో కూడా ఇదే ఆదరణ కొనసాగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌లో ఆసియా సినిమాస్ విజయవంతం అయిన తర్వాత వైజాగ్‌లో ఇంత పెద్ద, ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను ప్రారంభించడానికి సహకరించిన ఏషియన్ సునీల్, భరత్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా దేశవ్యాప్తంగా ఇలాంటి ప్రాజెక్టులు నిర్మించాలని కోరారు. ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న ఆర్కిటెక్ట్‌ను కూడా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఏషియన్, నారంగ్ కుటుంబాలలోని యువ తరానికి, వారి కృషికి కూడా ఆయన ప్రశంసలు అందించారు.

# 17 నుంచి అసెంబ్లీ

**మొదటి పేజీ తరువాయి...**

నిర్వహించే అవకాశం ఉన్నట్లు సచివాలయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**కీలక బిల్లులు, ప్రజా సమస్యలపై చర్చ....**

ఈ నాలుగు రోజుల పరిమిత కాలంలోనే రాష్ట్రంలోని పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజారోగ్యం, వ్యవసాయం, సంక్షేమ పథకాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శాసనసభ వేదికగా విపక్షాల ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానాలు ఇవ్వనుంది. వీటితో పాటు ప్రభుత్వం ప్రతిపాదించిన పలు కీలక బిల్లులను ఉభయ సభల్లో ప్రవేశపెట్టి ఆమోదం తెలపనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికార కూటమి, ప్రతిపక్ష వైసీపీ మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. డీఎస్సీలో అక్రమాలంటూ వైసీపీ నేతలు నిరసనలు చేస్తున్నారు. ప్రతిపక్షం లేవనెత్తుతున్న అంశాలపై... విద్యాశాఖ కూడా క్లారిటీ ఇస్తూ వస్తోంది. అయినప్పటికీ... ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని వైసీపీ డిమాండ్ చేస్తోంది. ప్రతిపక్ష నేతల ఆరోపణలు, విమర్శలను సీఎం చంద్రబాబుతో సహా మంత్రులందరూ కూడా కొట్టిపారేస్తున్నారు. ఇక భోగాపురం క్రెడిట్ విషయంలోనూ వైసీపీ, టీడీపీ నేతల మధ్య డైలాగ్ వార్ నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఈసారి జరిగే అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ హాజరవుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. గత కొంతకాలంగా సమావేశాలకు దూరంగా ఉంటున్న వైసీపీ ఎమ్మెల్యేలు... ఈసారైనా పాల్గొంటారా..? లేదా అనేది చూడాలి. ఒకవేళ వీరు హాజరైతే... చాలా అంశాలపై వాడీవేడీగా చర్చ జరిగే అవకాశం ఉంటుంది.



## ఉత్తరాది నుంచి దక్షిణాది వరకు

# ఇకపై భారీ వర్షాలు కురిసే ఛాన్స్

**మొదటి పేజీ తరువాయి...**

కొన్ని ప్రాంతాల్లో సోమవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. అసోం, మేఘాలయ, ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్, జమ్ముకశ్మీర్, లద్ధాఖ్, ఝార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా వర్షాల జోరు ఎక్కువగా ఉండనుంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, బీహార్, ఒడిశా తదితర ప్రాంతాలలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. హరియాణా, చండీగఢ్, దిల్లీ పరిసర ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈ ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణం ఉంటుందని హెచ్చరించారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో వర్షాలు మరింత జోరుగా కురుస్తాయని అంచనా. షిమ్లా వాతావరణ కేంద్రం సోమవారం, మంగళవారాల్లో హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాల పట్ల ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ వర్షాల ప్రభావం ఆగస్టు 14 వరకు ఉండే అవకాశం ఉంది. తూర్పు రాజస్థాన్‌లో సోమవారం భారీ వర్షాలు కురుస్తాయని, ఆగస్టు 10-11 తేదీల్లో కొన్ని చోట్ల అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమ మధ్యప్రదేశ్‌లోనూ భారీ వర్షాల హెచ్చరిక జారీ అయింది. ఉత్తరప్రదేశ్‌లో చెదురుమొదురుగా భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉంది. ఝార్ఖండ్‌లో సోమవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా, బీహార్, ఒడిశా రాష్ట్రాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడవచ్చు. కోస్తా కర్ణాటక, కేరళ, మహే, లక్షద్వీప్ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు తదితర దక్షిణ భారత రాష్ట్రాల్లో కూడా అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది.



# పార్లమెంట్‌కు ఆరు బిల్లులు

**మొదటి పేజీ తరువాయి...**

చేసే బిల్లును కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సమర్పిస్తారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ సవరణ బిల్లు: ఎన్సీడీసీ చట్టం-1962కు సవరణలు చేస్తూ రూపొందించిన ఈ బిల్లును కూడా అమిత్ షా సభలో ప్రవేశపెట్టనున్నారు.

**రాజ్యసభలో చర్చకు రానున్న బిల్లులు**

డిజిటల్ బ్యాంకింగ్ విధానాలకు అనుగుణంగా బ్యాంకింగ్ సాక్ష్యాధారాల చట్టాన్ని ఆధునీకరించే ఈ బిల్లును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పరిశీలన, ఆమోదం కోసం మూవ్ చేస్తారు. పన్నులు, ఇతర చట్టాల సవరణ బిల్లు: పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007, ఇన్‌కమ్ టాక్స్ యాక్ట్-2025 లలో అవసరమైన సవరణల కోసం ఈ బిల్లును ఎగువసభ పరిశీలించనుంది. ఈ కీలక బిల్లులతో పాటు పలువురు కేంద్ర మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, జయంత్ చౌదరి తదితరులు సంబంధిత అధికారిక పత్రాలను సభ సమక్షంలో ఉంచనున్నారు.

## జాబ్స్ కల్పనలో

# విశాఖ టాప్

### మెట్రోలు దాటి భారత్‌లో కొత్త ఉద్యోగ కేంద్రాలు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారతదేశంలో ఉద్యోగాల వృద్ధి ఇప్పుడు పెద్ద మెట్రో నగరాలకు మాత్రమే పరిమితం కాదు. టైర్-2, టైర్-3 నగరాల్లోనూ ఉద్యోగావకాశాలు వేగంగా పెరుగుతున్నాయని లింక్డ్‌ఇన్ తాజా నివేదిక వెల్లడించింది.లింక్డ్‌ఇన్ 'సిటీస్ ఆన్ ది రైజ్ 2026' నివేదిక ప్రకారం భారత్‌లో అత్యంత వేగంగా ఉద్యోగాలు పెరుగుతున్న 10 నాన్-మెట్రో నగరాల్లో విశాఖపట్నం మొదటి స్థానంలో నిలిచింది. దీని తర్వాత లూధియానా, సూరత్, వడోదర, ప్రయాగ్‌రాజ్, రాజ్‌కోట్, జబల్‌పూర్, రాంచీ, రాయ్‌పూర్, విజయవాడ నగరాలు ఉన్నాయి.ఈ ర్యాంకింగ్ 2024 మార్చి నుంచి 2026 ఫిబ్రవరి వరకు హైరింగ్ వృద్ధి, ఉద్యోగ ప్రకటనలు, ప్రతిభావంతుల వలసల ఆధారంగా తయారు చేశారు. పెద్ద మెట్రోలను మినహాయించి 25 లక్షల లింక్డ్‌ఇన్ సభ్యుల కంటే తక్కువ ఉన్న నగరాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు.

**విశాఖపట్నం ఎందుకు అగ్రస్థానం?**

పోర్టు, ఫార్మా, మాన్యుఫాక్చరింగ్‌లో ఇప్పటికే బలమైన విశాఖపట్నం ఇప్పుడు ఏఐ, డేటా సెంటర్లు, టెక్నాలజీ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తోంది. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ డేటా సెంటర్ ప్రాజెక్టులు, ఇన్ఫోసిస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్ వంటి కంపెనీల క్యాంపస్‌లు ఇక్కడ విస్తరిస్తున్నాయి.లూధియానా స్టీల్, ఏవియేషన్, హాస్పిటాలిటీ రంగాల్లో విస్తరిస్తోంది. సూరత్ టెక్స్‌టైల్స్, డైమండ్స్ నుంచి స్టార్టప్‌లు, ఎగుమతులు, రియల్ ఎస్టేట్‌కు మారుతోంది. వడోదర ఇంజనీరింగ్, టెక్, ఎంటర్‌ప్రైజ్ పెట్టుబడులను ఆకర్షిస్తుండగా, ప్రయాగ్‌రాజ్ పర్యాటకం, మౌలిక సదుపాయాల అభివృద్ధితో ముందుకు వెళ్తోంది. ఈ 10 నగరాల్లో ఐటీ సర్వీసెస్, టెక్నాలజీ కన్సల్టింగ్, బ్యాంకింగ్-ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాలు ఉద్యోగాల్లో ముందుండటం గమనార్హం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎల్‌ఢటీ, టీసీఎస్, హెచ్‌సీఎల్‌టెక్ వంటి కంపెనీలు ఈ నగరాల్లో తమ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. నిపుణుల ప్రకారం దేశంలో అధికారిక ఉద్యోగాల్లో సుమారు 70 శాతం ఇప్పుడు మెట్రోల బయటే ఉన్నాయి. తక్కువ నిర్వహణ ఖర్చులు, మెరుగైన మౌలిక సదుపాయాలు, మేక్ ఇన్ ఇండియా పథకం, జీసీసీల విస్తరణ వంటివి ఈ మార్పుకు దోహదం చేస్తున్నాయి. ఉద్యోగార్థులకు ఇది మంచి సంకేతం. బెంగళూరు, ముంబై, ఢిల్లీలోని రద్దీ, అధిక జీవన వ్యయం నుంచి దూరంగా, మెరుగైన జీవన ప్రమాణాలతో కొత్త అవకాశాలు వీటి ద్వారా అందుబాటులోకి వస్తున్నాయి.




## గిరిజనం కోసం

# సరికొత్త విధానం

**మొదటి పేజీ తరువాయి...**

బాగుందని ప్రధాని మోదీ సైతం కితాబిచ్చారని, మన్‌కీ బాత్‌లోనూ ప్రస్తావించారని సీఎం తెలిపారు. అరకు కాఫీని అతి త్వరలో గ్లోబల్ బ్రాండ్‌గా మారుస్తామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనులకు న్యాయం చేసిన తొలి పార్టీ టీడీపీనే అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు ఆయా ప్రాంత గిరిజనులకే దక్కాలనే సదుద్దేశంతో 2000 సంవత్సరంలో తాము 'జీవో నంబర్ 3' తీసుకొచ్చామన్నారు. అది దాదాపు 20 ఏళ్ల పాటు దిగ్విజయంగా అమల్లో ఉందన్నారు. అయితే, గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 2020లో సుప్రీంకోర్టు ఆ జీవోను కొట్టివేసిందని తెలిపారు. సుప్రీంకోర్టులో గత ప్రభుత్వం సరైన వాదనలు వినిపించకపోవడం వల్లే గిరిజనులకు ఈ అన్యాయం జరిగిందన్నారు. గిరిజనుల హక్కుల కోసం తమ ప్రభుత్వం పోరాడుతుందని స్పష్టం చేశారు. గిరిజనులకు లబ్ధి చేకూరేలా త్వరలో అందరికీ ఆమోదయోగ్యమైన సరికొత్త విధానాన్ని తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మొత్తం 29 లక్షల మంది గిరిజనులు ఉన్నారని సీఎం తెలిపారు. వారి అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. గిరిజనులకు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. 2027 డిసెంబరు నాటికి రాష్ట్రంలోని గిరిజనులందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. అలాగే వారందరికీ సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. 9 ఐటీడీఏ కేంద్రాల అభివృద్ధితో రానున్న రోజుల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు. మారుమూల గిరిజన తండాల్లో టెలికాం కనెక్టివిటీ పెంచేందుకు టెలీకమ్యూనికేషన్స్ సంస్థలతో ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. 2047 నాటికి 'వికసిత్ భారత్', 'స్వర్ణాంధ్ర' కలలు సాకారం అవుతాయని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన బిడ్డలు ఆవేశానికి లోనుకాకుండా, ఆలోచనతో ముందుకు సాగాలని సూచించారు. దేశం మనకు ఏమి ఇచ్చిందనేది కాకుండా, దేశానికి మనం ఏం ఇస్తున్నామనే ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. అడవి బిడ్డలు బాగా చదువుకుని ఐఐటీల స్థాయికి వెళ్లగలిగితే దేశానికి ఎంతో ఉపయోగపడినట్లే అని చెప్పారు. తాను ప్రజాప్రతినిధిగా ఎన్నికైనప్పటి నుంచి ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని గుర్తుచేశారు. ప్రజల జీవితాలను మార్చగలిగితే చాలు, అదే తనకు దక్కే అసలైన ఆనందమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# మెడికో ప్రియాంక మృతి

### మృత్యువుతో పోరాడి తుదిశ్వాస

### తాగుబోతుల పైశాచికానికి బలి

### హత్యాయత్నం కేసుగా నమోదు

### కఠినంగా శిక్షించాలన్న తండ్రి వెంకటేశ్

(రాజమహేంద్రవరం - జయజయహే)

నిండు జీవితం బలైపోయింది. కన్నీమిన్నూ కానకుండా, అత్యంత దారుణంగా కారు నడిపిన తాగుబోతుల దాష్టీకానికి ప్రియాంక ప్రాణం గాల్లో కలిసిపోయింది. కార్ టైర్ మెడ పైనుంచి ఎక్కేయడంతో బ్రెయిన్ డెడ్ అయ్యి.. మృత్యువుతో పోరాడి పోరాడి చివరికి ప్రియాంక శ్వాస ఆగిపోయింది. రాజమండ్రి మెడికో ప్రియాంక మృత్యువుతో పోరాడుతూ కన్నుమూసింది. సికింద్రాబాద్‌లో కిమ్స్‌లో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందింది. ప్రియాంక బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. మ.3:22కి మృతిచెందినట్టు వైద్యులు ప్రకటించారు. ఇద్దరు వ్యక్తులు ఆగస్టు 3న రాత్రి మద్యంమత్తులో ప్రియాంకను కారుతో ఢీకొట్టారు.. అప్పటినుంచి ప్రియాంక తీవ్రగాయాలతో చికిత్స పొందుతోంది. తాగుబోతుల పైశాచికత్వానికి రాజమండ్రిలో గాయపడినప్పటి నుంచి మెడికో ప్రియాంక పరిస్థితి అత్యంత విషమంగానే ఉంది. రాజమండ్రిలో చికిత్స అనంతరం.. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి ఆమెను తరలించారు. అప్పటినుంచి ఆమెకు డాక్టర్లు ఆమెకు చికిత్స అందిస్తున్నారు. ప్రియాంకకు ఇప్పటికే అప్నియా టెస్ట్ చేయాలని వైద్యులు ప్రయత్నించినా, అందుకు ఆమె శరీరం సహకరించలేదని పేర్కొంటున్నారు. శరీరంలో సోడియం లెవల్స్ 16కన్నా తక్కువగా ఉండటం వల్లే ఇది సాధ్యం కాలేదన్నారు. ఆమెను ఎలాగైనా కాపాడానికి డాక్టర్లు విశ్వప్రయత్నాలు చేసినప్పటికీ.. చివరకు ప్రియాంక బ్రెయిన్‌డెడ్ తో చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఉదయం రాజమండ్రి పీఎస్‌కు ప్రియాంక తండ్రి వెంకటేష్ వెళ్లారు. ప్రస్తుతమున్న కేసులో సెక్షన్లు వీక్‌గా ఉన్నాయా, శిక్షలు పడేలా విచారణ జరుగుతుందా అన్నదానిపై ఆరా తీశారు. డీఎస్పీలు దేవరాజ్, సుభాష్‌తో కేసుపై చర్చించారు. ఇది ముమ్మాటికీ మర్డరేనని అన్నారు. తప్పతాగి ఇలాంటి యాక్సిడెంట్స్ చేసేవారిని వదిలిపెట్టకూడదని ఆగ్రహం వ్యక్తం చేశారు వెంకటేష్.

**ఎస్పీ ఏమన్నారంటే..**

ప్రియాంకను యాక్సిడెంట్ చేసిన దశ్వంత్, ఆంద్రూ జోసెఫ్ ఎడ్వర్డ్స్‌పై ఇప్పటికే హత్యాయత్నం కేసు నమోదు చేశామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ కిషోర్ చెప్పారు. ఉద్దేశపూర్వకంగా వారిద్దరూ ప్రియాంకను ఢీకొట్టారని తెలిస్తే హత్యాయత్నం కేసును హత్యకేసుగా మారుస్తామని చెప్పారాయన. నిందితులను కస్టడీకి కోరుతున్నామన్నారు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ. ఈ కేసులో ప్రమేయం ఉన్నవారందరినీ అరెస్టు చేస్తామన్నారు.

**అసలేం జరిగిందంటే..**

ఈ ఆగస్ట్ 3వ తేదీ రాత్రి.. రాజమండ్రిలోని ప్రసాద్ ఆదిత్య మాల్‌లో సినిమా చూసి బయటికొచ్చారు ప్రియాంక, ఆమె ఫ్రెండ్. మాల్ నుంచి రోడ్డు మీదకు వెళ్లే సమయంలో కొన్ని క్షణాలు ఆపారు. కారణం.. రోడ్‌పై ట్రాఫిక్ ఉండడం. బట్.. వెనక కారులో ఉన్న నామవరానికి చెందిన సురవరపు దుష్యంత్, లాలాచెరువుకు చెందిన ఆంద్రూ విలియం జోసెఫ్.. ప్రియాంక బైక్‌ను ఢీకొట్టారు. మొదట 'ర్యాష్ డ్రైవింగ్' కింద సెక్షన్లు పెట్టారు. అది నిర్లక్ష్యం కాదు, తెలిసి ఉద్దేశపూర్వకంగా చంపేందుకు చేసిన ప్రయత్నమని నిర్ధారణ కావడంతో ఎఫ్ ఐ ఆర్ లో కీలక సెక్షన్లను మార్చారు. బీఎన్ ఎస్ 125(బి) స్థానంలో ఉద్దేశపూర్వకంగా హత్యాయత్నం చేసినందుకు బీఎన్ ఎస్ 308, హత్యాయత్నం కింద బీఎన్ ఎస్ 110 సెక్షన్లు చేర్చారు. ప్రస్తుతం నిందితులు దుష్యంత్, ఆంద్రూ జోసెఫ్ ఇద్దరూ 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌లో జైలు గోడల మధ్య ఉన్నారు.

# నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ వద్దు

**నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐ సూర్యకాంత్‌ను పిలవొద్దని విద్యార్థుల డిమాండ్**

**దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి యాజమాన్యానికి లేఖ అందజేశారు**

**నీట్ నిరసనలపై సీజేఐ చేసిన వ్యాఖ్యలే అభ్యంతరాలకు కారణంగా వెల్లడి**

**ఇటీవలే ముంబై టిస్‌లోనూ ఇదే తరహా నిరసనలతో స్నాతకోత్సవం వాయిదా**

**డిమాండ్ నెరవేరకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని విద్యార్థుల హెచ్చరిక**

**జయ జయహే :**

హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన గళం విప్పారు. ఈ మేరకు దాదాపు 450 మంది విద్యార్థులు సంతకాలు చేసి విశ్వవిద్యాలయ యాజమాన్యానికి ఒక లేఖ రాశారు. ఈ పరిణామం తెలంగాణ న్యాయ విద్యా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, 2026




బ్యాచ్ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించే ప్రతిపాదనను విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఢిల్లీలో జరిగిన నీట్ నిరసనలపై సుప్రీంకోర్టులో జూలై 22న జరిగిన విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం చేసిన వ్యాఖ్యలే ఈ నిరసనకు ప్రధాన కారణం. ఆ రోజు విచారణ సందర్భంగా, నిరసనకారులపై పోలీసుల చర్యకు సంబంధించిన వీడియోలపై సుమోటో విచారణ చేపట్టడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ క్రమంలో సీజేఐ, "వీడియోలు చూసే ఆసక్తి మాకు లేదు," "మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి" వంటి వ్యాఖ్యలు చేశారని విద్యార్థులు తమ లేఖలో పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలు అసంబద్ధంగా, బాధ్యతారహితంగా ఉన్నాయని, అందుకే ఆయనను స్నాతకోత్సవానికి పిలవరాదని వారు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా విద్యార్థులు ఇప్పటికే ఒక పూట భోజనం చేయకుండా నిరసన తెలిపారు. తమ అభ్యర్థనను యాజమాన్యం పట్టించుకోకపోతే, వారం రోజుల నోటీసు ఇచ్చి ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అయితే, నల్సార్ యాజమాన్యం స్నాతకోత్సవం తేదీని గానీ, ముఖ్య అతిథిని గానీ అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రతి ఏటా సీజేఐని స్నాతకోత్సవానికి ఆహ్వానించడం నల్సార్‌లో ఒక సంప్రదాయంగా వస్తోంది. కాగా, సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విద్యార్థుల నిరసనను ఎదుర్కోవడం ఇది రెండోసారి. ఈ నెల మొదట్లో ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్)లో జరగాల్సిన 86వ స్నాతకోత్సవానికి కూడా ఆయనే ముఖ్య అతిథిగా హాజరు కావాల్సి ఉంది. అయితే, ఎస్ఎఫ్ఐ అనుబంధ విద్యార్థులు నిరసన తెలిపే అవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారంతో ఆ కార్యక్రమాన్ని చివరి నిమిషంలో వాయిదా వేశారు. ఇప్పుడు టిస్ తర్వాత నల్సార్‌లోనూ అదే పరిస్థితి పునరావృతం కావడం గమనార్హం. విద్యార్థుల లేఖతో నల్సార్ యాజమాన్యం ఇప్పుడు ఇరకాటంలో పడింది.



## సేవాతత్పురినికి సేవారత్న అవార్డు

**శ్రీనివాస్ కు మార్నింగ్ కాఫీ క్లబ్ సత్కారం**

**భీమవరం ; (జయ జయహే)**

పదవులు అవార్డులు బాధ్యతలను మరింత పెంచుతాయని, సేవారత్న అవార్డు అందుకోవడం మన జిల్లాకే గర్వకారణమని మార్నింగ్ కాఫీ క్లబ్ ఫౌండర్ మరియు కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పిఆర్ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు, చవ్వా శ్రీనివాస సుబ్బారావు, కురిశెట్టి కాశి, అన్నారు. క్లబ్ సలహా మండలి సభ్యులు కొత్త శ్రీనివాస్ కోడి రామకృష్ణ సేవారత్న అవార్డును అందుకున్న సందర్భంగా ఆదివారం భీమవరం కాస్మో పాలిటిన్ క్లబ్ లో మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అడ్డ వంతెన వద్ద గోవింద క్షేత్రంలో దర్శనం, ఆశీర్వచనం నిర్వహించారు అనంతరం జరిగిన సభలో కారుమూరి సత్యనారాయణ మూర్తి, గుండు సుమూర్తి, కనగర్ల రామకృష్ణ,మానేపల్లి రవి చిన్నారావు మాట్లాడుతూ గత నెల 23న హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో జరిగిన కోడి రామకృష్ణ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవంలో భీమవరంలో విశిష్ట సేవాతత్పరులు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి, డిఎన్నార్ కళాశాల కోశాధికారి, మార్నింగ్ కాఫీ క్లబ్ సలహామండలి సభ్యులు, చిన్మయ మిషన్ కార్యదర్శి కొత్త శ్రీనివాస్ కోడి రామకృష్ణ సేవారత్న అవార్డు అందుకున్నారని అన్నారు. పరుచూరి నాగేశ్వరావు, సన్నిధి గుప్తా, కురిశెట్టి నాని మాట్లాడుతూ సేవాతత్పురినికి సేవా రత్న అవార్డు రావడం అభినందనీయమని, రానున్న రోజుల్లో మరెన్నో అవార్డులు సాధించాలని కోరుకుంటున్నామని అన్నారు. అనంతరం వారిని కొత్త శ్రీనివాస్ ను సత్కరించారు. కార్యక్రమంలో మానేపల్లి వెంకన్నబాబు, బొండాడ బంగారురాజు,కోట్ల ప్రసాద్,చవ్వా భామ కృష్ణమూర్తి, కంచర్ల భాస్కరరావు గుప్త, జూలూరి రాజా,బంగారు ప్రసాద్, బంగారు రాము, కొప్పర్తి అప్పారావు, సకల కుమార్, కురిశెట్టి ప్రభాకర్ , సభ్యులు పాల్గొన్నారు.




## కొయ్యూరులో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ ఆగష్టు 10,**

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కొయ్యూరు మండలంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతితో మమేకమైన జీవన విధానాన్ని చాటిచెప్పేలా ఆదివాసీ సోదర సోదరీమణులు సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు. కోలాటం, గిరిజన నృత్యాలతో కార్యక్రమం ఆకట్టుకుంది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసులు ప్రకృతికి పరిరక్షకులు, సంస్కృతికి వారసులు. అడవులను కాపాడటంలో, జీవవైవిధ్యాన్ని నిలబెట్టడంలో ఆదివాసీల పాత్ర ఎంతో గొప్పది" అని తెలిపారు. ఆదివాసీల అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని జై ఆదివాసీ జై జై ఆదివాసీ అంటూ నినాదాలు చేశారు.



## రాష్ట్రస్థాయి యోగ పోటీలకు చోడవరం విద్యార్థులు ఎంపిక

**చోడవరం,ఆగస్టు9, జయ జయ హే**

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అమరావతి క్రీడలులో భాగంగా ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ అనకాపల్లి స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన అనకాపల్లి జిల్లా స్థాయి యోగ ఆసన పోటీల్లో చోడవరం పతంజలి యోగా శిక్షణ కేంద్రం విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్17 లో విభాగంలో పొట్నూరు పవన్ కుమార్ ఓమ్మి శ్యాంప్రసాద్ యాదవ్ అండర్ 23 విభాగంలో మల్లా శ్రీహిత విజయం సాధించి రాష్ట్ర స్థాయి యోగ పోటీలకు ఎంపికైనట్లు యోగ గురువు సతీష్ తెలిపారు.వీరిని ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ రవి నాయుడు ఎమ్మెల్యే సుందర్ విజయకుమార్ కోట్ని బాలాజీ అనకాపల్లి జిల్లా క్రీడాకారి శైలజ అభినందనలు తెలుపుతూ రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కూడా ప్రతిభ సాధించి అనకాపల్లి జిల్లాకు చోడవరం యోగా కేంద్రానికి మంచి పేరు తీసుకురావాలని యోగ గురు సతీష్ ఆకాంక్షించారు.



## ఏజెన్సీ గిరిజనులుగా గుర్తించాలి

**ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం**

**అడవి అడ్డాకు టోపీ ధరించి పాదయాత్ర,**

**అనంతగిరి:ఆగష్టు09, జయ జయహే**

అరకు నియోజకవర్గం అనంతగిరి మండలం పరిధిలో ఉన్న ఐదు పంచాయతీలు రొంపల్లి ,ఎన్ ఆర్ పురం, భీం పోలు, గుమ్మ కోట, గరుగుబెల్లి 64 గిరిజన రెవెన్యూ గ్రామాలకు 20వేల మంది నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాల్లో జీవనం సాగిస్తున్న గిరిజనులు పేరుకే గిరిజనులమ్మే నూటికి 97 మంది గిరిజనులమే నివాసం ఉంటున్నామని మమ్మల్ని ఏజెన్సీ గిరిజనులుగా గుర్తించలేదు అని దీనివల్ల 1/70 చట్టం ఏజెన్సీ కోర్టుకు పిసా వంటి చట్టాలు మాకు అమలు కావు, గిరిజన నేతల సమానంగా మమ్మల్ని ప్రభుత్వాలు చూస్తున్నాయని మా గ్రామాల భూములు మాకు తెలియకుండా, రుణాలు ఇప్పిస్తామని చెప్పి, మా తల్లిదండ్రులకు కళ్ళు పెట్టించి, మా భూమిలను రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు రెవెన్యూ అధికారులు కుమ్మక్కై మా భూములు రికార్డులు మార్చేసారని రెవెన్యూ కోర్టులో దరఖాస్తు చేస్తే సివిల్ కోర్టుకు వెళ్ళమని చెప్తున్నారు, సివిల్ కోర్టుకు వెళ్లాలంటే లక్షలు ఖర్చు అవుతుంది ఈ డబ్బులు మేము అంత భరించలేము ఇటువంటి పరిస్థితుల్లో నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలు తీవ్ర అన్యాయానికి గురి అవుతున్నాయని తెలిపారు, ఇప్పటికైనా షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని, ఎన్ ఆర్ పురం, పెద్దూరు నుండి రాయపాడు, సీముడువలస బొంగిజ, చిన్న కోలని, బోరుగ మీదుగా ఓట్లు వేయాలంటే13 కిలోమీటర్లు, ఎవరికైనా అనారోగ్య తొ బాగోలేని వారికి వైద్యం కొరకు 20 కిలోమీటర్లు రాకపోకలకు వంటి పరిస్థితి ఉందని తెలిపారు , ఆదివాసులుగా మేము మమ్మల్ని ఏజెన్సీ గిరిజనులుగా గుర్తించాలని కోరారు, ఈ సందర్భంగా అడ్డాకులు టోపీ ధరించి మూడు కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు, మా భూములకు రక్షణ కల్పించాలని మా గ్రామాలను 5 షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో ఎస్ అప్పలరాజు, కె సింహాచలం తదితరులు పాల్గొన్నారు,



## ఇంటింటికి కూటమి ప్రభుత్వం

**డుంబ్రిగూడ:09 ఆగష్టు, జయ జయహే,**

మండలంలోని సొవ్వ పంచాయితీ పరిధిలోని ఉన్న గ్రామాలకు ఇంటింటికీ కూటమి కార్యక్రమాని, యూనిట్ ఇంచార్జ్ పాంగి మోహన్ దాస్ నిర్వహించారు, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో అమలు చేయిస్తున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రజాలకు వివరించారు, ఎన్నికల్లో హామీలు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు, ప్రజా సంక్షేమమే ప్రజలకు లక్ష్యాన్ని తెలిపారు



## చాపరాయిలో ఘనంగా ప్రపంచాదివాసి దినోత్సవము వేడుకలు

**డుంబ్రిగూడ: ఆగష్టు 09, జయ జయహే.**

డుంబ్రిగూడ మండలం చాపరాయి జలపాతం వద్ద 32 వ .ప్రపంచ ఆదివాసి దినోత్సవము వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి శాంత కుమారి సందర్శించారు, దింసా కళాకారులతో కలిసి సంప్రదయ దింసా నృత్యం ఆడుతూ ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు,

## అంగన్వాడి భవనాలకు రెండు కోట్లు మంజూరు

**మాడుగుల, ఆగస్టు 9 జయ జయ హే**



మాడుగుల మండలంలో గల 18 అంగన్వాడి కేంద్రాలకు నూతన భవనాలు మంజూరైనట్టు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆదివారం తెలిపారు. ఒక్కొక్క భవనానికి 12 లక్షల రూపాయలు చొప్పున రెండు కోట్ల 16 లక్షల రూపాయలు మంజూరయ్య అన్నారు. వాటిలో ఢీ గోటివాడ,కాశిపురం,మాడుగుల 3, శంకరం తాటిపర్తి , వేల్లంపాడు,రాజంపేట, తేజ పురం నాలుగు, ఐదు కేంద్రాలు, ముకుందపురం, అవరువాడ, గొప్పుల పాలెం, రావిపాలెం, తుమ్మ వానపాలెం,ఒంద్రువీధి,సత్యవరం2,ఓ ఎం పాలెం,పి గదబవీధి గ్రామాలలో నూతన అంగన్వాడి భవనాలు నిర్మించేందుకు ఈ నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు.

# మహిళల ప్రతిభకు వేదికగా 'సిటీ కుక్ ఛాంపియన్‌షిప్'

**ప్రతిభను చాటుకున్న మహిళలు:ఎమ్మెల్యే వంశీకృష్ణ**

**విశాఖపట్నం: (జయ జయహే)**





మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, వారిలోని సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు 'సిటీ కుక్ ఛాంపియన్‌షిప్' వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. రేడియో సిటీ ఆధ్వర్యంలో కేపీ పాల్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన సిటీ కుక్ ఛాంపియన్‌షిప్ సీజన్--3' కార్యక్రమానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంతోమంది మహిళలు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని తమలోని ప్రతిభను ప్రదర్శించడం, వివిధ రకాల వంటకాలను సరికొత్త రుచులతో తయారు చేయడం ఎంతో ఆహ్లాదకరంగా ఉదన్నారు. వంటల్లో తమ ప్రతిభను చాటుకుంటూ మహిళలు సృజనాత్మకతను ప్రదర్శించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి పోటీలు కేవలం విజేతలను ఎంపిక చేయడానికే పరిమితం కాకుండా, ప్రతి ఒక్కరూ ఒకే వేదికపై కలిసిమెలిసి, స్నేహభావంతో పాల్గొనేలా చేస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. పోటీల్లో గెలుపోటముల కంటే ఐక్యత, స్నేహభావం, ప్రతిభను పంచుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. రేడియో సిటీ నిర్వాహకులు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తూ మహిళలను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా మహిళల ప్రతిభను వెలికితీసే మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

For a pure tomorrow.. జయహో



# కొండల గుండె చప్పుడు

కొండల గుండె చప్పుడు వినిపిస్తే
అది గాలి పాట కాదు
తరతరాల చరిత్రను మోసుకొచ్చిన
ఆదివాసి ఆత్మగానం!

అడవి ఆకుపచ్చని పుస్తకమైతే
దాని ప్రతి పుటలో వారి అడుగుజాడే
వాగు జలధార సంగీతమైతే
దాని ప్రతి స్వరంలో వారి జీవగీతమే.

మట్టిని తల్లిగా పిలిచిన చేతులు
చెట్టును దేవతగా కొలిచిన మనసులు
ప్రకృతిని దోచుకోవడం కాదు
ప్రేమించడం నేర్పిన సంస్కృతి.

నాగరికత వెతలు రాకముందే
జీవన విలువలను వెలిగించిన జాతి
అక్షరాలు రాకముందే
అనుబంధాలకు అర్థం చెప్పిన జాతి.

కొండల ఎత్తంత ఆత్మగౌరవం
విశాల గగన హృదయం;
కష్టాల తుఫాన్లు వీచినా
వంగని జీవన తత్వం.

ఆదివాసి అంటే ఒక శాపం కాదు
భూమితో మనిషి బంధానికి ప్రతిరూపం
ఆదివాసి అంటే కాదు ఒక నామం
ప్రకృతి గుండెలోని పరంధామం!

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
వారిని స్మరించుకునే రోజు మాత్రమే కాదు
వారి హక్కులను గౌరవించే రోజు
వారి సంస్కృతికి తలవంచే రోజు.

డాక్టర్ విశ్వేశ్వరరావు కొణపల రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్

# భారత ఆర్థికాభివృద్ధికి పర్యాటక రంగమే చోదకశక్తి

## (సుస్థిర విధానాలతోనే ప్రపంచ పర్యాటక కేంద్రంగా భారత్)

-హెచ్.ప్రతాప్

**పర్యాటక, ఆతిథ్య రంగం దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే ప్రధాన వృద్ధి ఇంజిన్‌గా రూపుదిద్దుకుంటోంది. వ్యవసాయం, పరిశ్రమల తర్వాత అత్యధిక ఉపాధిని కల్పించే సేవారంగంలో ఇది కీలక భాగంగా నిలుస్తోంది. ప్రస్తుతం ఈ రంగం భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 5.22 శాతం వాటాను అందిస్తుండగా, మొత్తం ఉపాధిలో 13.34 శాతం మందికి జీవనోపాధి కల్పిస్తోంది. 2047 నాటికి 10 కోట్ల విదేశీ పర్యాటకులను ఆకర్షించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ సేవల విస్తరణ, ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై దృష్టి సారిస్తోంది.**



భారత పర్యాటక రంగం గత కొన్నేళ్లుగా గణనీయమైన వృద్ధిని నమోదు చేస్తోంది. 2024లో విదేశీ పర్యాటకుల రాక 2.05 కోట్లకు చేరగా, దేశీయ పర్యాటక పర్యటనలు గత రెండు దశాబ్దాల్లో 680 కోట్ల నుంచి 1,860 కోట్లకు పెరగడం ఈ రంగం విస్తరణకు నిదర్శనం. ప్రపంచ ట్రావెల్ అండ్ టూరిజం కౌన్సిల్ అంచనా ప్రకారం 2034 నాటికి భారత పర్యాటక రంగం 523 బిలియన్ డాలర్ల ఆర్థిక విలువను సృష్టించి ప్రపంచంలో నాలుగో అతిపెద్ద పర్యాటక ఆర్థిక వ్యవస్థగా ఎదిగే అవకాశం ఉంది.

'స్వదేశ్ దర్శన్', 'ప్రసాద్' వంటి పథకాల ద్వారా అయోధ్య, వారణాసి, ఉజ్జయిని, పూరీ, కేదార్‌నాథ్ వంటి ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధి స్థానిక ఆర్థిక వ్యవస్థలకు కొత్త ఊపునిచ్చింది. వైద్య సేవల నాణ్యత, తక్కువ ఖర్చు కారణంగా భారత మెడికల్ టూరిజం మార్కెట్ 2030 నాటికి 16 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. అదేవిధంగా యూపీఐ, డిజియాత్ర, ఈ-వీసా వంటి డిజిటల్ సదుపాయాలు పర్యాటకుల ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తున్నాయి. ప్రస్తుతం పర్యాటక బుకింగ్‌లలో దాదాపు 60 శాతం ఆన్‌లైన్ వేదికల ద్వారానే జరుగుతున్నాయి.

అయితే ఈ రంగం పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి కొన్ని సవాళ్లను అధిగమించాల్సి ఉంది. పర్యాటకుల పట్ల అనుచిత ప్రవర్తన, అధిక ధరల వసూళ్లు, భాషా సమస్యలు, పరిశుభ్రత లోపం, చివరి దశ రవాణా సౌకర్యాల కొరత దేశ ప్రతిష్ఠను ప్రభావితం చేస్తున్నాయి. ప్రీమియం హోటళ్లపై 18 శాతం జీఎస్టీ, ఇంధనంపై అధిక పన్నులు, హోటళ్ల స్థాపనకు 60కుపైగా అనుమతులు అవసరం కావడం పెట్టుబడులను నిరుత్సాహపరుస్తున్నాయి. అదేవిధంగా నియంత్రణలేని పర్యాటకం వల్ల షిమ్లా, జోషిమఠ్ వంటి పర్యావరణ సున్నిత ప్రాంతాల్లో నీటి కొరత, భూస్ఖలనాలు, కాలుష్య సమస్యలు పెరుగుతున్నాయి.

భారత్ ప్రపంచ పర్యాటక శక్తిగా ఎదగాలంటే సమగ్ర సంస్కరణలు అవసరం. పర్యాటక, ఆతిథ్య రంగానికి దేశవ్యాప్తంగా "పరిశ్రమ హోదా" కల్పించి తక్కువ వడ్డీ రుణాలు అందుబాటులోకి తీసుకురావాలి. సింగిల్-విండో అనుమతి వ్యవస్థ ద్వారా పెట్టుబడులను వేగవంతం చేయాలి. ప్రతి రాష్ట్రంలో ప్రత్యేక టూరిస్ట్ పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసి, బహుభాషా అత్యవసర సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత, భద్రత, సౌకర్యాల నిర్వహణలో స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి.

భవిష్యత్ పర్యాటకం సుస్థిరతపై ఆధారపడి ఉంటుంది. పర్యావరణ సున్నిత ప్రాంతాల్లో క్యారీయింగ్ కెపాసిటీ ఆధారంగా సందర్శకుల సంఖ్యను డిజిటల్ బుకింగ్ ద్వారా నియంత్రించాలి. హోమ్‌స్టేలు, గ్రామీణ పర్యాటకం, ఎకో-టూరిజం, గిరిజన సంస్కృతి, వన్యప్రాణి పర్యాటకం, క్రూయిజ్ టూరిజం, సాహస పర్యాటకాన్ని ప్రోత్సహించాలి. పాత డాక్ బంగ్లాలను డిజిటల్ నోమాడ్ కేంద్రాలుగా మార్చడం, హరిత ధ్రువీకరణ పొందిన హోటళ్లకు పన్ను రాయితీలు ఇవ్వడం, గైడ్లు, డ్రైవర్లు, హోమ్‌స్టే నిర్వాహకులకు అంతర్జాతీయ ప్రమాణాల శిక్షణ అందించడం సేవల నాణ్యతను పెంచుతుంది. భారతీయ హస్తకళలు, స్థానిక వంటకాలు, జానపద కళలను పర్యాటకంతో అనుసంధానించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలు లభిస్తాయి.

పర్యాటక రంగానికి అధిక ఉపాధి కల్పించే సామర్థ్యమే కాకుండా విదేశీ మారకద్రవ్యాన్ని సమకూర్చే, ప్రాంతీయ అసమానతలను తగ్గించే, స్థానిక సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసే విశిష్ట శక్తి ఉంది. మౌలిక వసతులు, డిజిటల్ సాంకేతికత, సుస్థిర పర్యాటకం, పారదర్శక విధానాలు, పౌర బాధ్యత, నైపుణ్యాభివృద్ధి అనే ఐదు స్తంభాలపై దృష్టి సారిస్తే, 2047 నాటికి భారత్ ప్రపంచంలో అత్యంత ఆకర్షణీయమైన, సురక్షితమైన, సుస్థిరమైన పర్యాటక గమ్యస్థానంగా అవతరించడం సాధ్యమవుతుంది.

# పాఠశాలల్లో సమగ్ర రక్షణ వ్యవస్థ ఆవశ్యకత

(హెచ్.ప్రతాప్)



విద్యాలయం అంటే విద్యార్థులకు జ్ఞానాన్ని అందించే స్థలం మాత్రమే కాదు; భద్రత, విశ్వాసం, వ్యక్తిత్వ వికాసానికి నిలయంగా ఉండాలి. పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలకు పంపేది కేవలం చదువు కోసమే కాదు, వారు సురక్షిత వాతావరణంలో ఎదుగుతారనే నమ్మకంతో. అయితే ఇటీవల హైదరాబాద్ సమీపంలోని బౌరంపేట ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాల వసతి గృహంలో సీనియర్ విద్యార్థులు ఇద్దరు ఐదో తరగతి విద్యార్థులపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగించింది. ఈ సంఘటన పాఠశాలల్లో విద్యార్థుల భద్రతా వ్యవస్థపై మౌలిక ప్రశ్నలను లేవనెత్తింది.

ఇది ఒక్క సంఘటన మాత్రమే కాదు. ఇటీవలి కాలంలో దేశంలోని పలు విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు సంబంధించిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ర్యాగింగ్, లైంగిక వేధింపులు, శారీరక హింస, పర్యవేక్షణ లోపాలు, ఆహార భద్రత సమస్యలు వంటి సంఘటనలు పాఠశాలల్లో సమగ్ర రక్షణ వ్యవస్థ అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. ముఖ్యంగా రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో పిల్లలు ఎక్కువ సమయం గడిపే కారణంగా భద్రతా ప్రమాణాలు మరింత కట్టుదిట్టంగా ఉండాలి.బాలలపై లైంగిక నేరాలను నిరోధించేందుకు అమల్లో ఉన్న పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం--2012 (పోక్సో చట్టం) విద్యాసంస్థలపై ప్రత్యేక బాధ్యతను విధిస్తోంది. బాలలపై లైంగిక వేధింపుల సమాచారాన్ని దాచిపెట్టడం కూడా శిక్షార్హమే. ప్రతి పాఠశాలలో బాలల రక్షణ విధానం, ఫిర్యాదుల స్వీకరణ వ్యవస్థ, తక్షణ స్పందన యంత్రాంగం సమర్థంగా పనిచేయడం తప్పనిసరి.

పాఠశాల భద్రత అంటే కేవలం ప్రహరీ గోడలు, సీసీటీవీ కెమెరాలు, భద్రతా సిబ్బందితో ముగిసిపోదు. విద్యార్థులపై నిరంతర పర్యవేక్షణ, సురక్షిత వసతి గృహాలు, మానసిక ఆరోగ్య పరిరక్షణ, లైంగిక వేధింపుల నివారణ, ర్యాగింగ్ నిరోధం, పరిశుభ్రమైన ఆహారం, తాగునీరు, అత్యవసర వైద్య సదుపాయాలు, సమర్థవంతమైన ఫిర్యాదు వ్యవస్థ---ఇవన్నీ కలిసే సమగ్ర భద్రతా వ్యవస్థగా మారాలి. వార్డెన్లు, ఉపాధ్యాయులు, కౌన్సెలర్లు విద్యార్థుల శారీరక, మానసిక సంక్షేమాన్ని నిరంతరం పర్యవేక్షించే విధానం అవసరం.

పిల్లలు భయపడకుండా తమ సమస్యలను తెలియజేసే వాతావరణం కల్పించడం అత్యంత కీలకం. ప్రతి పాఠశాలలో బాలల భద్రతా విధానం, గోప్య ఫిర్యాదు పెట్టె, ప్రత్యేక సహాయ కేంద్రం, శిక్షణ పొందిన మానసిక పరామర్శకుడు అందుబాటులో ఉండాలి. ఉపాధ్యాయులు, వార్డెన్లు, సహాయక సిబ్బందికి బాలల హక్కులు, పోక్సో చట్టం, మానసిక ఆరోగ్యం, అత్యవసర స్పందనపై క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వాలి. విద్యాసంస్థల్లో పనిచేసే ప్రతి ఉద్యోగికి పోలీసు ధృవీకరణ తప్పనిసరి చేయాలి.

అంతేకాదు, విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను ముందుగానే గుర్తించే వ్యవస్థ కూడా అవసరం. భయం, ఒత్తిడి, ఒంటరితనం, హింసాత్మక ప్రవర్తన వంటి సంకేతాలను ఉపాధ్యాయులు గుర్తించి, తల్లిదండ్రులతో సమన్వయం చేస్తూ తక్షణ జోక్యం చేసుకోవాలి. పాఠశాలలు, తల్లిదండ్రులు, స్థానిక సమాజం మధ్య నిరంతర సంభాషణ ఉండాలి. భద్రతా తనిఖీలు, సామాజిక తనిఖీలు, స్వతంత్ర మూల్యాంకనాలను క్రమం తప్పకుండా నిర్వహించాలి.

ప్రభుత్వం ప్రతి విద్యాసంస్థకు ప్రామాణిక భద్రతా మార్గదర్శకాలను రూపొందించి వాటి అమలును కఠినంగా పర్యవేక్షించాలి. విద్యాశాఖ, పోలీసు శాఖ, మహిళా--శిశు సంక్షేమ శాఖ, బాలల హక్కుల పరిరక్షణ సంఘాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలి. నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల భద్రతకు భంగం కలిగితే సంబంధిత యాజమాన్యాలపై, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల భద్రతను పరిపాలనా అంశంగా కాకుండా విద్యా నాణ్యతలో అంతర్భాగంగా పరిగణించాలి.

ఒక దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మితమవుతుంది. ఆ తరగతి గదుల్లో పిల్లలు భయంతో కాకుండా భరోసాతో కూర్చునే పరిస్థితిని కల్పించడం ప్రభుత్వం, విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం అందరి ఉమ్మడి బాధ్యత. విద్యార్థి భద్రతకు భరోసా లేని విద్యా వ్యవస్థ ఎంత గొప్ప విద్యను అందించినా అది సంపూర్ణం కాదు. ప్రతి పాఠశాల నిజమైన అర్థంలో జ్ఞానాలయంగా మారాలంటే, ముందుగా అది ప్రతి చిన్నారికి సురక్షితమైన, గౌరవప్రదమైన, విశ్వాసాన్ని కలిగించే వాతావరణంగా మారాలి.

# భక్తి, జ్ఞానం, వైరాగ్యాల సమన్వయం భాగవతం

(సి.హెచ్.ప్రతాప్)

భారతీయ ఆధ్యాత్మిక సాహిత్యంలో శ్రీమద్భాగవత మహాపురాణంకు విశిష్టమైన స్థానం ఉంది. వేదవ్యాస మహర్షికి ఆపాదించబడిన ఈ మహాపురాణం కేవలం పురాణ గాథల సమాహారం కాదు; భక్తి, జ్ఞానం, వైరాగ్యం, ధర్మం, మానవత వంటి విలువలను సమన్వయపరిచి, జీవిత పరమార్థాన్ని అన్వేషించే మార్గాన్ని చూపించే ఆధ్యాత్మిక గ్రంథం. ఇతర శాస్త్రాలు తమదైన తాత్త్విక, ధార్మిక, ఆచారపరమైన అంశాలను ప్రతిపాదిస్తే, భాగవతం భగవంతునిపై ప్రేమ, శరణాగతి, భక్తి ద్వారా ఆత్మోన్నతికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుంది.

భాగవతం యొక్క ప్రత్యేకతను వివరించేటప్పుడు భక్తి సంప్రదాయంలో దీనిని "భగవత్ప్రోక్తం" అనే భావంతో గౌరవిస్తారు. అంటే భగవంతుని స్వరూపం, మహిమ, లీలలు, భక్తి తత్త్వాన్ని భగవంతుడే వెల్లడించినట్లుగా భావించే ఆధ్యాత్మిక దృష్టి. గ్రంథంలోని సంభాషణలు ఋషులు, రాజులు, భక్తుల ద్వారా సాగినా, వాటి అంతిమ లక్ష్యం పరమాత్మ తత్త్వాన్ని, భగవంతుని ఆశ్రయాన్ని తెలియజేయడమే.

భాగవతాన్ని ప్రత్యేకంగా నిలబెట్టే మరో అంశం దశలక్షణాలు. సృష్టి, విసర్గ, స్థానం, పోషణ, ఊతి, మన్వంతరం, ఈశానుకథ, నిరోధం, ముక్తి, ఆశ్రయం అనే పది అంశాలను భాగవతం ప్రతిపాదిస్తుంది. సాధారణంగా పురాణాలకు సర్గ, ప్రతిసర్గ, వంశం, మన్వంతరం, వంశచరిత్ర అనే పంచలక్షణాల సంప్రదాయం చెప్పబడుతుంది. భాగవతంలోని దశలక్షణాలు విశ్వసృష్టి నుంచి జీవుని విముక్తి వరకు విస్తృతమైన ఆధ్యాత్మిక దృక్పథాన్ని అందిస్తాయి.

భాగవతం వేదాంత సారాన్ని భక్తి దృష్టితో ప్రజలకు చేరువ చేసిన గ్రంథంగా కూడా ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా వైష్ణవ సంప్రదాయాలలో ఇది వేదాంత తత్త్వానికి ముఖ్యమైన పురాణాధారంగా గౌరవించబడుతుంది. జ్ఞానం, కర్మ, యోగ మార్గాలను నిరాకరించకుండా, వాటిని భక్తితో అనుసంధానించి, భగవంతునిపై నిష్కల్మషమైన ప్రేమే ఆధ్యాత్మిక జీవితానికి పరమసాధనగా వివరిస్తుంది.

నవవిధ భక్తి భాగవతంలోని మరొక విశిష్టమైన అంశం. శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అనే తొమ్మిది భక్తి విధానాలు భగవంతునితో అనుబంధాన్ని ఏర్పరచుకోవడానికి విభిన్న మార్గాలను సూచిస్తాయి. దీనివల్ల భక్తి ఒకే విధమైన ఆచారం కాకుండా, ప్రతి వ్యక్తి తన స్వభావానికి అనుగుణంగా అనుసరించగల ఆధ్యాత్మిక మార్గంగా మారుతుంది.

భాగవతంలో శ్రీకృష్ణుని లీలలకు అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. బాలకృష్ణుడి లీలలు, గోపికల భక్తి, గోవర్ధనగిరి ధారణ, కంసవధ, ఉద్ధవోపదేశం వంటి ఘట్టాలు కృష్ణతత్త్వాన్ని భక్తి, ప్రేమ, ధర్మం, శరణాగతి కోణాల్లో ఆవిష్కరిస్తాయి. ప్రహ్లాదుడు, ధ్రువుడు, గజేంద్రుడు, అంబరీషుడు, అజామిళుడు వంటి భక్తుల కథలు కూడా భాగవతాన్ని సాధారణ మానవ జీవితానికి దగ్గర చేస్తాయి. కష్టాల్లోనూ విశ్వాసాన్ని కోల్పోకపోవడం, అహంకారాన్ని విడిచిపెట్టడం, భగవంతునిపై శరణాగతి ఉంచడం వంటి విలువలను అవి బోధిస్తాయి.

కలియుగ ప్రాసంగికత భాగవతానికి మరో ప్రత్యేకత. కలియుగంలో నామస్మరణ, సత్సంగం, భక్తి వంటి సులభమైన మార్గాల ద్వారా ఆధ్యాత్మిక పురోగతి సాధించవచ్చని భాగవత సంప్రదాయం విశ్వసిస్తుంది. "కలౌ కీర్తనాత్" అనే భావన ద్వారా నామసంకీర్తనకు ఇచ్చిన ప్రాధాన్యం దీనిని ప్రజల ఆధ్యాత్మిక జీవితంలో మరింత చేరువ చేసింది. వేగవంతమైన ఆధునిక జీవనంలో ఒత్తిడి, అసంతృప్తి, ఆందోళన పెరుగుతున్న నేపథ్యంలో ఈ భక్తిమార్గం అంతరంగ శాంతికి ఒక సాధనగా నిలుస్తోంది.

తెలుగు సాహిత్యంలో బమ్మెర పోతన భాగవతంకు ప్రత్యేకమైన స్థానం ఉంది. 15వ శతాబ్దానికి చెందిన పోతన సంస్కృత భాగవతాన్ని తెలుగులో పద్యరూపంలో ఆవిష్కరించి, భక్తి భావాన్ని అపూర్వమైన కవితా సౌందర్యంతో తెలుగు ప్రజలకు అందించాడు. అది కేవలం పదానువాదం కాదు; స్వతంత్ర కవితా ప్రతిభ, భక్తి, తెలుగు భాషా మాధుర్యాల సమ్మేళనం. అందుకే పోతన భాగవతం తెలుగు ప్రజల ఆధ్యాత్మిక, సాహిత్య జీవితంలో చిరస్థాయిగా నిలిచింది.

భాగవతం యొక్క ప్రత్యేకతను ఇతర శాస్త్రాలతో పోల్చేటప్పుడు వాటిని తక్కువ చేసి చూడటం అవసరం లేదు. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాసాలు, ఇతర పురాణాలు భారతీయ జ్ఞాన సంప్రదాయానికి తమదైన విశిష్టమైన సేవ చేశాయి. అయితే భక్తిని కేంద్రంగా చేసుకుని సృష్టి నుంచి ముక్తి వరకు, భగవంతుని లీలల నుంచి మానవ హృదయ పరివర్తన వరకు ఒక సమగ్ర ఆధ్యాత్మిక ప్రయాణాన్ని నిర్మించడం భాగవతం ప్రత్యేకత.

అందుకే శ్రీమద్భాగవతం కేవలం ఒక పురాణ గ్రంథం కాదు. భక్తికి హృదయాన్ని, జ్ఞానానికి వివేకాన్ని, వైరాగ్యానికి స్థిరత్వాన్ని, ధర్మానికి దిశను అందించే ఆధ్యాత్మిక దిక్సూచి. భౌతిక ప్రగతి ఎంత పెరిగినా అంతరంగ శాంతి, మానవత, ఆత్మపరిశీలన అవసరం తగ్గదు. ఆ అవసరాన్ని గుర్తుచేస్తూ, జీవితం యొక్క అంతిమ లక్ష్యం బాహ్య విజయాల్లో కాకుండా అంతరంగ పరివర్తనలో ఉందని బోధించడమే భాగవతం యొక్క శాశ్వత మహిమ.

# తాటిపళ్ళతో తాటితోపులను పెంచుదాం





### సామాజికవణాలు పెంచడం మానవాళి బాధ్యత

### ప్రతి విద్యార్థికి పర్యావరణం పట్ల అవగాహన కల్పించాలి

### నాగరాజు, విశ్రాంత పంచాయతీ అధికారి

**విశాఖపట్నం (జయ జయహే)**

తాటిపళ్ళతో తాటితోపులను పెంచుదాం అని విశాఖ జిల్లా విశ్రాంత పంచాయతీ అధికారి నాగరాజు కోరారు . ఆదివారం ఉదయం గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో, ధాత్రి ఫౌండేషన్ ల నేతృత్వంలో తాటి పళ్ళు, విత్తనాల బంతులు మధురవాడ లోని ఎన్ వి పి లా కాలేజీ ఎదురుగా ఉన్న కొండల మీద విద్యార్థులతో చల్లిన తర్వాత ఆయన మాట్లాడారు. విద్యార్థులతో ఈ విధంగా విత్తనాల బంతులు తయారు చేయడం కొండల మీద వేయడం ఆరోగ్యకరమైన అలవాటని అన్నారు. అందుకే తాను సైతం తన కొడుకు, మనమరాళ్లతో వచ్చి విత్తన పంతులు చల్లానని అన్నారు. సామాజికవనాలు పెంచడం మానవాళి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జే వి రత్నం మాట్లాడుతూ మనం తినే పళ్ళ లోని విత్తనాలతో వనాలు పెంచుదాం అన్నారు. ప్రతి విద్యార్థి కనీసం 100 విత్తనాల బంతులు తయారు చేసి కొండల మీద, మైదాన ప్రాంతాల్లో చల్లాలని కోరారు. శీతోష్ణస్థితి వేడెక్కుతున్న తరుణంలో అత్యధికంగా మొక్కలు పెంచాలని, వృక్ష సంపదను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి పల్లెలో , పట్టణంలో తాటితోపులు అత్యధికంగా పెంచాలని కోరారు. తాటితోపులు అధికంగా ఉంటే పిడుగులు వల్ల జీవావరణానికి నష్టం ఉండదు అన్నారు. ధాత్రి ఫౌండేషన్ అధ్యక్షులు విశాలాక్షి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పర్యావరణం పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనదే అని వివరించారు. విద్యార్థి దశలో అవగాహన కలిగితే వాళ్లు పర్యావరణ హితంగా జీవించే అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థులతో ఒక హరిత సైన్యాన్ని తయారు చేసే బాధ్యత మన మీదే ఉందన్నారు. ఇందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 50 మందికి పైగా విద్యార్థులు, యాక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.




## రక్తదానం.. ప్రాణదానంతో సమానం: ఎమ్మెల్యే వంశీకృష్ణ

### వాయుపుత్ర హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**విశాఖపట్నం: (జయ జయహే)**

రక్తదానం చేయడం ఎంతో విలువైన సేవ అని, ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రామా టాకీస్ వద్ద వాయుపుత్ర హెల్త్ క్లబ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 32వ రక్తదాన శిబిరానికి ఎమ్మెల్యే శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువకులను అభినందించి, వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రక్తానికి ప్రత్యామ్నాయం లేదని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు. సమాజంలో రక్తం కొరత లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా రక్తదాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వాయుపుత్ర హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో వరుసగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ, ప్రజల్లో రక్తదానంపై అవగాహన కల్పించడం అభినందనీయమని ఎమ్మెల్యే ప్రశంసించారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



## ప్రజా సంక్షేమమే ప్రజలకు లక్ష్యం

**అరకులోయ: ఆగష్టు09 జయ జయహే.**

అరకు వేలి మండలం బస్కి పంచాయితీ కొర్రగూడ గ్రామంలో ఇంటింటికి కూటమి కార్యక్రమాన్ని బస్కి పంచాయితీ అధ్యక్షులు బాలరాం, ప్రధాన కార్యదర్శి కామరాజు, ఆర్గనైజర్ సెక్రటరీ ధర్మరాజు, యూత్ అధ్యక్షులు పాంగి రవికుమార్ కూటమి నాయకులతో సందర్శించారు కర్ర పత్రాలతో ప్రజాలకు అవగాహన సదస్సు ను, అరకు నియోజకవర్గం టిడిపి పార్టీ ఇంచార్జ్ ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పరిపాలనలో అమలు చేస్తున్న సంక్షేమం అభివృద్ధి పథకాలను ఇంటి ఇంటికి వెళ్లి ప్రజాలకు ఈ కార్యక్రమాన్ని వివరించారు, ఎన్నికలలో హామీలు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రజలకు లక్ష్యమని తెలిపారు, ఈ కార్యక్రమంలో పంచాయతీ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల భారీ రద్దీ

### వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు నిండి బయటకు చేరిన క్యూలైన్లు

### సర్వదర్శనానికి 20 నుంచి 24 గంటల నిరీక్షణ

### ఒక్కరోజే రూ.4.13 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

**జయ జయహే**

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు బయటకు విస్తరించాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు కిలోమీటర్ల మేర బారులు తీరిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. సర్వదర్శనం టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి దర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని అధికారులు వెల్లడించారు. మొత్తం 87,658 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 40,606 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.13 కోట్లుగా నమోదైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు 4.15 లక్షల లడ్డూలను విక్రయించగా, 3.09 లక్షల మందికి అన్నప్రసాదం అందించారు. వారాంతం కావడంతో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగినట్లు తెలుస్తోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అధికారులు తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పిస్తూ రద్దీని క్రమబద్ధీకరించే ప్రయత్నాలు చేస్తున్నారు. భారీ రద్దీ నేపథ్యంలో, తిరుమలకు వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని టీటీడీ సూచిస్తోంది.

# తేజ్ భరత్‌కు సహకరించిన అధికారులపై చర్యలకు డిమాండ్

### - అవినీతి అక్రమాలలో వాటాలున్న వారిపై నిగ్గు తేల్చండి


### - 8 నెలల్లో తీసుకున్న నిర్ణయాలు, అవినీతిపై కమిటీని నియమించండి

### - రూ. కోట్ల అంచనాల టెండర్ల పెంపులను నిలువరించండి

### - జనసేన మాజీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

**విశాఖపట్నం, ఆగష్టు 9, జయ జయహే :**

పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలతో విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ (వి.ఎం.ఆర్.డీ.ఏ) పరువు తీసిన కమిషనర్ తేజ్ భరత్ పై బదిలీ వేటు సరే కానీ ఆయనకు అవినీతి వాటాల్లో ఆరితేరిన వారిపై ప్రభుత్వం దృష్టి సారించాలని మాజీ కార్పోరేటర్ పీతల మర్తి యాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కోట్ల రూపాయల అవినీతి



అక్రమాలతో వి.ఎం.ఆర్.డి.ఏ పరువు తీసిన తేజ్ భరత్ ను పోస్టింగ్ లేకుండా బదిలీ చేయడం పై హర్షం వ్యక్తం చేశారు. వీఎంఆర్డీఏ కమిషనర్గా పనిచేసిన తేజ్ భరత్ తో పాటు ఆయన భజన బృందం ప్రశాంతమైన విశాఖలో అలజడిని అల్లకల్లోలాని సృష్టించిందని పేర్కొన్నారు. తేజ్ భరత్ బూతులు తిట్లు భరించలేక, ఆయన చెప్పిన విధంగా అవినీతి అక్రమాలకు పాల్పడలేక ఎంతోమంది నిజాయితీపరులైన అధికారులు వి.ఎం.ఆర్.డి.ఏ నుండి వీడి వెళ్లిపోయారని, వీటన్నిటిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి తేజ్ భరత్‌కు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నిబంధనలకు విరుద్ధంగా విఎంఆర్డీఏలో సృష్టించిన కొత్త పోస్టులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా దొడ్డి దారిలో నియామకమైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని పేర్కొన్నారు. తేజ్ భరత్ కమిషనర్గా తన సొంత రాజ్యాంగాన్ని విఎంఆర్డీఏలో అమలుపరిచారని, నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరించారని ఆరోపించారు. బోర్డు సమావేశాలలో చాలా అతిగా ప్రవర్తించారంటూనే ఈ ఎనిమిది నెలల కాలంలో బోర్డులో తీసుకున్న నిర్ణయాలపై విచారణ జరిపి లోటుపాట్లపై దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన చర్యల కారణంగా సంస్థకు రూ. వందల కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున అటువంటి నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని కోరారు.



### జాతీయ పతాకాన్ని

## పునరుద్ధరించండి

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి ముఖద్వారంగా ఉన్న విశాఖ విజయవాడ అనంతపురం కూడలి జాతీయ రహదారి వద్ద జాతీయ పతాకాన్ని పునరుద్ధరించాలని ఆ ప్రాంతాన్ని జాతీయ పతాకం జెండా రూపకర్త పింగళి వెంకయ్య స్మృతి వనంగా నిర్మించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాని కార్యదర్శి బుగిడి నూక అప్పారావు డిమాండ్ చేశారు జాతీయ రహదారి హైవేలో రౌండ్ సర్కిల్లో ఉన్న జాతీయ పతాకం కొన్ని మాసములుగా లేకుండా పోవడం తో ఒంటి స్తంభం స్తూపం వద్ద వీరు నిరసనను తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి పట్టణమునకు మార్గ సూచీగా అటు ఫ్లైఓవర్ బ్రిడ్జి ఇటు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద వెళ్లే వాహనదారులు ప్రయాణికులు ఈ పొడవాటి మూడు రంగుల మన జాతీయ పతాకం కనుల విందుగా ఉండేది అటు ఇటు వెళ్లే ప్రయాణికులు కొందరు సెల్ఫీలు వీడియోలు కూడా తీసి ఆనందపడే వారిని కానీ ఈనాడు జాతీయ పతాకం అక్కడ లేకపోవడంతో అక్కడ వేసిన స్తంభం బోడిగా కనిపిస్తున్నది. జాతీయ పతాకం నాలుగేళ్ల క్రితం జిల్లా కలెక్టర్ అప్పటి ప్రజాప్రతినిధులు సహాయ సహకారాలతో నాలుగు లక్షల రూపాయలతో 72 అడుగుల ఎత్తు మెటల్ స్తంభం నిర్మించి ఈ జాతీయ జెండాను ఆవిష్కరించారు ఇప్పుడు ఈ జాతీయ జెండా కనుమరుగవడంతో అటు అనకాపల్లి పట్టణ ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు జాతీయ జెండా కనబడకపోవడంతో విచార వ్యక్తం చేస్తున్నరు ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు చొరవ చూపించి ఈ జాతీయ జెండాను ఆవిష్కరించి పింగళి వెంకయ్య స్మృతి వనముగా అక్కడ తయారు చేసి అనకాపల్లి పేరు తెస్తారని వారు కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో షేక్ రెహమాన్ రాపేటి భాస్కర్ నాగరాజు రాంప్రసాద్ గొలగాని సన్యాసిరావు పిల్ల లక్ష్మీనారాయణ బ్లైండ్ అసోసియేషన్ భార్గవ బుద్ధ ధనలక్ష్మి ఆడారి అన్నపూర్ణ చవితిన కృష్ణవేణి వారాది దుర్గ గుడుపు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

### ఈనెల 12న అచ్యుతాపురంలో

## మెగా జాబ్ మేళా

**మాడుగుల ఆగస్టు 9 జయ జయహే**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా అచ్యుతాపురం ఏ పీ ఐ ఐ సి, వన్ స్టాప్ సర్వీస్ సెంటర్ , సెజ్ వద్ద ఈనెల 12న మెగా జాబ్ మేళా రాష్ట్ర నైపుణ్యా అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి రోహిని ఆదివారం తెలిపారు. సుమారు 20 బహుళజాతీయ కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్న ఈ ఇంటర్వ్యూలకు పదవ తరగతి,ఐ టి ఐ, డిప్లొమా,డిగ్రీ, పి జి వరకు చదువుకొని 18 నుండి 40 ఏళ్ల వయస్సు గల యువతీ, యువకులు పాల్గొనవచ్చున్నారు. కాబట్టి ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరములను నైపుణ్యం. ఏపీ. జి ఓ వి. ఐ ఎన్ వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డు తో పాటుగా ఎక్కువ రెస్యూమేలు, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు జెరాక్స్ లతో జాబ్ మేళా జరుగు ప్రదేశానికి ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరముల 81425 65416 నంబర్లను సంప్రదించగలరు.

### కాశీ విశ్వేశ్వరునికి ఘనంగా

## సహస్ర ఘట్టాభిషేకం





**అనకాపల్లి జయ జయహే**

స్థానిక వేల్పుల వీధిలో వేంచేసి ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర దేవాలయం లో ఆదివారం ఉదయం స్వామివారికి ఘనంగా సహస్ర గట్టాభిషేకం నిర్వహించడం జరిగింది లోక శాంతిర్థం సకాలంలో వర్షాలు కురవాలని కోరుతూ పట్టణంలోని ప్రజలు పెద్దలు పండితులు కలిసి స్వామివారికి సహస్ర గట్టాభిషేకం జలాభిషేకం నిర్వహించడం జరిగింది . పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని నీళ్లు బిందులతో, కడవలతో, కొందరు వెండి బిందెలతో ఇలా భక్తులు దేవాలయం ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ హర హర మహాదేవ శంభో శంకర, హర హర గంగాధర శంభో శంకర, మహాదేవ శంభో శంకర అంటూ స్వామివారికి జలాభిషేకం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి రత్నాకర్ గవరకార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర అర్చక పండితులు బాబు, విస్సు, శర్మ,దక్షిణామూర్తి పాలకవర్గ సభ్యులు వంశపార్య ధర్మకర్తలు అధిక సంఖ్యలో మహిళ భక్తులు తదితరులు పాల్గొన్నారు

For a pure tomorrow.. జయహో

# ఘనంగా వేద విద్వత్ మహాసభ






**అనకాపల్లి జయ జయహే**

స్థానిక గాంధీ నగరంలో గల రామాలయంలో ఆదివారం సాయంత్రం వేద విద్వత్ మహాసభ అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఉమ్మడి జిల్లా నుంచి వేద పండితులను ఘనంగా ఆహ్వానించి వారిచే కృష్ణ యజుర్వేదం, సామవేదం, ఋగ్వేదం,అధర్వణ వేదం పండితులు వేద పఠనం చేయడం జరిగింది మరియు వేద పాఠశాల చెందిన బాలురిచే వేద పఠనం చేయించడం జరిగింది ఈ వేద విద్వత్ మహాసభకు అధిక సంఖ్యలో బ్రాహ్మణులు పాల్గొనడం జరిగింది ఈ వేద విద్వత్ సభ అనంతరం పండితులను ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో అనకాపల్లి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గంటి రవికుమార్ కమిటీ సభ్యులు పేరూరి భోగలింగం, తమ్మి రాజు శ్యామ్, విశ్వనాథం, సోమశేఖర్, బమ్మిడిపాటి కిరణ్, పూజ్యం నాగబాబు, పాండురంగారావు, పేరూరు చిన్ని, కొడుకులశ్రీకాంత్, కొడుకుల శేఖర్,చావలి రమేష్,బాపట్ల ప్రకాష్, దేవరకొండ లక్ష్మీనారాయణ చింత సుబ్రమణ్యం,చింత గణేష్, చింత గోపి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వేదుల సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థుల్లో పోటీ తత్వం పెరగాలి

**ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం.**

**తిరుపతి, ఆగస్టు 9, జయ జయహే.**



పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థుల్లో మరింత పోటీ తత్వం పెరగాలని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఆకాంక్షించారు. పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన జర్నలిస్టు పిల్లలకు డాక్టర్ సిపాయి ప్రతిభా పురస్కారాలను ప్రెస్ క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మురళి, బాలచంద్రలతో కలిసి నగదు ప్రోత్సాహక పురస్కారాన్ని విద్యార్థులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సిపాయి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య తోనే ఉన్నత భవిష్యత్తు ఉ ంటుందని అన్నారు. ఉన్నత చదువుతూనే సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయన్నారు. తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకువచ్చేలా సత్ప్రవర్తనతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అదోహించాలని ఆయన సూచించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షా కార్యదర్శులు మురళి, బాలచంద్రా మాట్లాడుతూ విద్యార్థులను మరింతగా ప్రోత్సహించాలన్న ఉద్దేశంతోనే పిల్లలకు ప్రతిభా పురస్కారాలు అందజేశామన్నాడు. లక్ష్యాన్ని దర్శించుకుని, అందుకు అనుగుణంగా చదవాలని, మొబైల్స్, టీవీలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరీలు జగదీష్, విజయ్ యాదవ్, ఈసీ మెంబర్లు నాగార్జున, కోటి, బాలయ్య, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2025-2 6లో ఇంటర్మీడియట్ విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి 987/1000 సాధించిన కంజుల స్వేజిత్ రెడ్డి తో పాటు పలువురికి నగదు పురస్కారాలు, మెమెంటోలతో డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం స్వయంగా సత్కరించి అభినందనలు తెలిపారు.




## రక్తదానం మరో ప్రాణికి జీవమిచ్చే సంజీవిని

**అగనంపూడి ఏరియా ఆస్పత్రి డాక్టర్ ప్రమీల**

**అగనంపూడి, ఆగష్టు 9, జయ జయహే :**

రక్తదానం మరో ప్రాణికి జీవం పోసే సంజీవిని లాంటిదని అగనంపూడి ఏరియా ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ వి. ప్రమీల అన్నారు. జీవీఎంసీ 79 వ వార్డు అగనంపూడి శనివాడ జాబిల్లి హిల్స్ వద్ద ఏ వన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ ఏఎంఏ అకాడమీ యూత్ రక్తదాన్ని శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్త ఒకరి ప్రాణాన్ని కాపాడటమే కాకుండా ఒక కుటుంబానికి ఆశను అందిస్తుందని చెప్పారు. ప్రతి ఆరోగ్యవంతమైన వ్యక్తి రక్తదానం చేయడానికి ముందుకు రావాలి" అని పిలుపునిచ్చారు. విక్టోరియా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి హేమలత మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ప్రసవానికి ఘోషాసుపత్రి చాలా ప్రసిద్ధమైనదని రక్తదాతలను "బీ ఎ హీరో -- బీ ఎ డోనర" అంటూ అభినందించారు. ఒకరి రక్తదానం అవసరమైన పరిస్థితుల్లో ముగ్గురి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ముఖ్య అతిథులని ఏఎంఏ అకాడమీ నిర్వాహకులు సన్మానించారు. రక్తదానం చేసిన 30 మంది యువకులు కు డాక్టర్ వి ప్రమీల సర్టిఫికెట్స్ అందజేశారు. అకాడమీ హెడ్ కోచ్ కొమ్ముజి అశోక్ సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, గాజువాక నియోజకవర్గం టిడిపి డాక్టర్ సెల్ అధ్యక్షులు సిహెచ్ తాతాజీ, అగనంపూడి లైన్స్ క్లబ్ అధ్యక్షులు జి గోవిందరావు, కిక్‌బాక్సింగ్, క్లాసికల్ డ్యాన్స్, వెస్టన్ డ్యాన్స్, జుంబా ఫిట్‌నెస్ విభాగాల సభ్యులు, వాలంటీర్లు మరియు స్థానికులు పాల్గొన్నారు



## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి

**సత్యవేడు, ఆగస్టు 09,జయ జయహే.**

సత్యవేడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధిచెక్కులనునియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ కూరపాటి శంకర్ రెడ్డి పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద ప్రజలకు సకాలంలో అందుతున్నాయని తెలిపారు.ఆపద సమయంలో తమను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సాయం చేస్తున్న కూరపాటి శంకర్ రెడ్డికి లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రాజగోపాలపురంలో తాగునీటి కోసం ప్రజల అవస్థలు

**బోర్లు లేవు.. ట్యాంకులు పనిచేయవు**

**గుంట నీరే త్రాగు నీరు**

**సత్యవేడు, ఆగస్టు 09,జయ జయహే**

సత్యవేడు మండలం రాజగోపాలపురం గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా మారిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా గ్రామంలో సక్రమంగా నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఐదు రోజులకు ఒకసారి కేవలం గంటపాటు మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారని, ఆ సమయంలో కూడా అన్ని కుటుంబాలకు సరిపడా నీరు అందడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.గ్రామంలో రెండు నీటి ట్యాంకులు ఉ న్నప్పటికీ వాటి పరిస్థితి దయనీయంగా ఉందని వారు పేర్కొన్నారు. ఒక నీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతోదాన్నిపూర్తిస్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. మరో ట్యాంకు ఉన్నప్పటికీ దానికి అవసరమైన నీటి సరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా మారిందని తెలిపారు. దీంతో అందుబాటులో ఉన్న నీటిని నిల్వ చేసుకునే అవకాశం కూడా లేకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం కొందరు గ్రామస్థులు దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు నీటి కోసం అవస్థలు పడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి అవసరాలకు, వంటకు, తాగడానికి సరిపడా నీరు అందకపోవడంతో రోజువారీ జీవితం కూడా ఇబ్బందికరంగా మారిందన్నారు. నీటి సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామస్థులు తెలిపారు. వేసవి కాలంలో నీటి కొరత మరింత తీవ్రంగా ఉంటుందని, అయితే ప్రస్తుతం కూడా పరిస్థితిలో పెద్దగా మార్పు లేదని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో జనాభా, కుటుంబాల సంఖ్యకు అనుగుణంగా తాగునీటి వసతులను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త బోర్లు ఏర్పాటు చేసి, వాటికి మోటార్లు అమర్చి గ్రామానికి నిరంతరాయంగా నీటిని సరఫరా చేయాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. శిథిలావస్థకు చేరిన నీటి ట్యాంకును పునరుద్ధరించడంతో పాటు, నీటి సరఫరా లేని మరో ట్యాంకుకు కూడా నీటిని అందించే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులపై ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. సమస్యను కేవలం తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు రాజగోపాలపురం గ్రామంలోని తాగునీటి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి, అవసరమైన చర్యలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## మృతుని కుటుంబానికి 30,000 ఆర్థిక సాయం

**మాడుగుల ఆగస్టు 9 జయ జయహే**

మాడుగుల మండలం సత్యవరం గ్రామానికి చెందిన కింతలి గాదిరాయి రూరల్ వాసవి క్లబ్ సభ్యుడైన పుట్ట నాగరాజు ఈనెల ఎనిమిదో తేదీ రాత్రి మృతి చెందారు. దీంతో ఆ పేద కుటుంబాన్ని ఆదుకునేందుకుగాను అత్యవసర సేవలకు గాను క్లబ్ తరఫున సుమారు 30 వేల రూపాయలు ఆర్థిక సాయం, బియ్యం ఆదివారం అందజేశారు. తమ క్లబ్బు పరిధిలో పేద సభ్యులు ఎవరైనా మృతి చెందితే అత్యవసర ఖర్చులకు ఆర్థిక సాయం అందిస్తామని క్లబ్ సభ్యులు తెలిపారు.


## డోర్ టు డోర్ మరింత వేగవంతం చేయండి

**పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే విజ్ఞప్తి**

**మాడుగుల ఆగస్టు 9 జయ జయహే**



మాడుగుల నియోజకవర్గంలో డోర్ టు డోర్ కార్యక్రమం మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డోర్ టు డోర్ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. మాడుగుల నియోజవర్గంలో కూడా తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అయితే నియోజకవర్గంలో ఈ కార్యక్రమం చాలా నెమ్మదిగా జరుగుతుందనీ, కాబట్టి నాలుగు మండలాల మండల పార్టీ అధ్యక్షుడు, కార్యదర్శులు, క్లస్టర్,యూనిట్, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు,గ్రామ పార్టీ అధ్యక్షుడు, కార్యదర్శులు అందరూ ప్రత్యేక శ్రద్ధ చూపి ఈ కార్యక్రమంలో మరింత ఉత్సాహంతో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.



## నిత్య అన్నదాన ట్రస్ట్‌కు రూ 1,00,000 విరాళం

**పూతలపట్టు,ఆగస్టు09,జయ జయహే.**

శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం నిత్య అన్నదానం ట్రస్ట్ కి రూ 1,00,000/-రూపాయలు దాతలు ఆలయ అధికారులకు ఆదివారం చెక్కును అందజేశారు.హైదరాబాద్ ఓం సాయి మోటార్స్ నీలిమ ఈ విరాళం అందజేశారు.వీరికి ఆలయ సూపర్డెంట్ వాసు దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## వినాయక స్వామి ఆలయానికి రూ 1,10,00విరాళం

**పూతలపట్టు,ఆగస్టు 9.జయ జయహే.**

కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ నిత్య అన్నదానం గో సంరక్షణ ట్రస్ట్ కి రూ'1,10,00వేల రూపాయలు దాత ఆలయ అధికారులతో చెక్కును అందజేశారు. బెంగళూరుకు చెందిన నాగరాజాచారి దీపికారాణి విరాళాన్ని అందజేశారు. స్వామి వారి దేవస్థానం నిత్య అన్నదానం ట్రస్ట్ కి - 59,999/- రూపాయలు డి.డి స్వామి వారి గోసంరక్షణ ట్రస్ట్ కి -50,001/- రూపాయలు డి.డి మొత్తం - 1,10,000లు అందజేశారు. వీరికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలను టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడుఅందజేశారు.

# జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకాన్ని అమలు చేయాలి

## ఏపీయూడబ్ల్యూజే

**బుచ్చయ్యపేట,జయ జయహే**



సమాజాభివృద్ధికి పాటుపడుతున్న జర్నలిస్టులను ప్రత్యేక కేటగిరీగా పరిగణించి ఆర్థిక భరోసా కల్పించాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి సిహెచ్బిఎల్ స్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఆదివారం వడ్డాది తిరుమల కన్వెన్షన్లో మాడుగుల ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం చైర్మన్ జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ప్రజల కోసం ఎన్నో సంక్షేమ రకాల అమలు చేస్తున్న ప్రభుత్వాలు జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం, విధి నిర్వహణలో రక్షణ కల్పించాలని కోరారు. రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టుల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తామని హామీలు ఇస్తున్నారు తప్ప అమలు కావడం లేదన్నారు.జిల్లా కార్యదర్శి,జిల్లా అక్రిడేషన్ కమిటీ మెంబర్ కె చంద్రరావు మాట్లాడుతూ అర్హత కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు,ఇళ్లు మంజూరు చేయాలి అన్నారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యా రాయితీలు కల్పించాలి అన్నారు.జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలన్నారు.జిల్లా అధ్యక్షుడు జోగినాయుడు మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజానికి ఉపయోగపడే ప్రత్యేక కథనాలను రాయాలన్నారు.సమాజాన్ని ప్రభావితం చేసే కథనాలతోనే గుర్తింపు లభిస్తుంది అన్నారు.ఏపీయూడబ్ల్యూజే నిరంతరం జర్నలిస్టుల సంక్షేమం కోసమే పనిచేస్తుందన్నారు. సీనియర్ పాత్రికేయులు శరగడం రామకోటి,మాడుగుల ప్రెస్ క్లబ్ కార్యదర్శి కే నారాయణ రావు,జిల్లా ఉపాధ్యక్షుడు రొంబ్బా శ్రీనివాసరావు మాట్లాడారు.మాడుగుల,చీడికాడ, బుచ్చయ్యపేట,రావికమతం మండలాల పత్రికా విలేకరులు హాజరయ్యారు.రాష్ట్ర,జిల్లా, మాడుగుల ప్రెస్ క్లబ్ ప్రతినిధులను బుచ్చయ్యపేట మండల విలేకరులు ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు.



# భారీ తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన

**అచ్యుతాపురం, ఆగస్టు 9, జయ జయహే:**

అచ్చుతాపురం నియోజకవర్గ కేంద్రమైన ఎలమంచిలిలో తాగునీటి అవసరాలు తీర్చడం కోసం 128 కోట్లతో నిర్మించనున్న భారీ తాగునీటి ప్రాజెక్టుకు అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ ఆదివారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుందని, దీంట్లో భాగంగానే ఎలమంచిలిలో ప్రతి ఇంటికి కులాయి కలెక్షన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మౌలిక సంక్షేమ పథకాలు అందించడంతోపాటు, అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులెత్తిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్న ప్రధానమంత్రి ప్రధాన మోడీకి ఎంపీ సీఎం రమేష్ మరియు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, కూటమి నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, పెరబత్తుల తాతయ్య బాబు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజాన సన్యాసినాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# మత్స్యకారుల జీవితాలు నాశనం చేయవద్దు

**నక్కపల్లి జయ జయహే**

దోనివానిలక్ష్మీపురం గ్రామంలో మత్స్యకారులు నివశిస్తున్న ప్రాంతం చుట్టూ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం సిమెంట్ స్తంభాలతో ఫెన్సింగ్ వేస్తున్నారు అంతే కాకుండా గ్రామాన్ని ఆనుకుని పెద్ద పెద్ద యంత్రాలతో పనులు చేపడుతున్నారు దీని కారణంగా దుమ్ము ధూళి పెద్ద ఎత్తున ఎగిరి గ్రామంలో చేరడంతో గ్రామస్తులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అంతే కాకుండా 2025 ఏప్రిల్ మూడవ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ కు క్యాప్టీవ్ పోర్టు ఏర్పాటు కు అనుమతి ఇచ్చారు ఈ పోర్టు కొరకు 2.9 కిలోమీటర్లు సముద్ర తీరం దారా దత్తం చేయడం జరిగింది, దీని కారణంగా దోనివాని లక్ష్మీ పురంలో గల మత్స్యకారుల తో పాటు బంగారయ్య పేట, అమలాపురం,బోయపాడు, రాజయ్య పేట మత్స్యకారుల కూడా సముద్రతీరం లో కి వేటకు వెళ్ళ నివ్వరు ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం లాభాలు కోసం వేలాది మంది మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారులు చట్టాలను, కోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకోకుండా అత్యంత గోప్యంగా ఇక్కడ ఏం జరుగుతుందో తెలియనీయకుండా పనులు చేపడుతున్నారని జరుగుతున్న చట్ట విరుద్ధం పనులకు అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్,కె.దేముడు, ఓ.చిట్టిబాబు, జీ.సింహాద్రి,జీ.కాసులు,ఏ బాబ్జీ,డి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు



### మెగా హీరోలు ప్రయాణించిన

# కారు ఎవరిది!

**సోషల్ మీడియాలో వైరల్**

**విశాఖపట్నం, ఆగస్టు 9:(జయ జయహే)**

టాలీవుడ్ అగ్రశ్రేణి నటులు రాంచరణ్ తేజ్, అల్లు అర్జున్ లు వినియోగించిన కారు గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో, అభిమానుల్లో విస్తృత చర్చ జరుగుతోంది. మంగళగిరి స్టేడియంలో జూన్ నెలలో జరిగిన ఏపీఎల్ మ్యాచ్ లో రాంచరణ్ ప్రయాణించిన ఏపీ 40 ఎల్ఈ 1 ల్యాండ్ క్రూయిజర్ కారులోనే ఆదివారం అల్లు అర్జున్ విశాఖ ఇన్ ఆర్బిట్ మాల్ లోని ఏఏఏ థియేటర్ల ప్రారంభోత్సవానికి రావడంతో ఆ కారు గురించి అనేకమంది ఇప్పుడు ఆరా తీస్తున్నారు. ఈ కారు మెగాస్టార్ చిరంజీవికి, ఆయన కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుది. మెగా కుటుంబ సభ్యులెవరు విశాఖ వచ్చినా గంటా వారికి ఆత్మీయ ఏర్పాట్లు చేస్తుంటారు. “ఇద్దరు హీరోలు ఒకే కారులో ప్రయాణించారు. అనుబంధం అంతర్గతంగా ఎప్పుడూ ఉంటుంది. అభిమానులు ఫ్యాన్ వార్ లు పక్కన పెట్టాలి” అని సోషల్ మీడియాలో ఇద్దరు హీరోలు ప్రయాణించిన కారు ఫోటోలు వైరల్ అవుతున్నాయి.



# న్యాయవాద వృత్తిలో రాణించేందుకు దగ్గర మార్గాలుండవ్

**భారత అడిషనల్ సొలిసిటర్ జనరల్**

**బ్రిజేష్ బన్సల్**

**విశాఖపట్నం, ఆగస్టు 9, జయ జయహే**

న్యాయవాద వృత్తిలో రాణించాలటే దగ్గర దారి ఏది లేదని, ఎంత కష్టపడితే అంత వృద్ధి లోకి చేరుకుంటారని భారత అడిషనల్ సొలిసిటర్ జనరల్ బ్రిజేష్ బన్సల్ అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ప్రవేశించిన తర్వాత మొదటి ఐదు సంవత్సరాలు కష్ట పడి పని చేయవలసిన అవసరం ఉంటుందని, ఒకసారి మనల్ని మనం నిరూపించుకున్న తర్వాత అంచలంచెలుగా ఎదుగుతామని అదే సమయంలో న్యాయ మూర్తులుగా ఎదిగి ఉన్నత స్థానాలను కూడా అధిరోహిస్తామని అంటూ అనేక మంది సీనియర్ న్యాయవాదులను, న్యాయమూర్తులు నియామకం పొందారని ఉదహరించారు. న్యాయవాది మొదటి రెండు సంవత్సరాలు ట్రయిల్ కోర్టులో పని చేసినట్లయితే కావలసినంత అనుభవం వస్తుందని తరువాత హైకోర్టులకు సుప్రీంకోర్టులలో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. నేటి పరిస్థితుల్లో మధ్యవర్తిత్వం ఎంతగానో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని విద్యార్థులు మధ్య వర్తిత్వంలో కూడా నిపుణత సాధించాలని తెలిపారు. సీనియర్ న్యాయవాదులు కేసులు వాదించే విధానాన్ని నిశితంగా గమనించి వారి నుంచి ఎంతో నేర్చుకోవచ్చన్నారు. ప్రసంగం అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన ఎంతో ఉత్సాహంగా సమాధానం ఇచ్చారు. చదువుకున్న విశ్వవిద్యాలయాన్ని గురువులను గౌరవించి ముందుకు కొనసాగుతూ ఉండాలని తెలియజేస్తూ విద్యార్థులతో ఇలా రెండు మూడు గంటలు గడపడం ఎంతో ఆనందంగా ఉందని తనకున్న అనుభవాన్ని న్యాయవాద వృత్తి లోకి భవిష్యత్తులో రాబోయే నేటితరంతో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందనన్నారు. విశాఖపట్నం ఎంతో అందమైన పట్టణమని అలాగే దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం కూడా ఎంతో పచ్చదనంతో ఎంతో ఆనందకరంగా ఉందని తరచుగా ఇక్కడికి వచ్చి విద్యార్థులతో సంభాషించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను తెలియచేస్తూ విశ్వవిద్యాలయమును ఉన్నత స్థానంలో నిలుపుతున్న విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ సూర్యప్రకాశరావు గారిని అభినందించారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విశ్వవి ద్యాలయ ఇన్ఛార్జి రిజిస్టార్ విశ్వచంద్రనాద్ మాదాసు అకడమిక్ డైరెక్టర్ సోమభట్ట ఆచార్య ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇజ్రాయెల్‌లో మిలిటరీ సెలవులు రద్దు... ఇరాన్‌పై దాడుల కోసమేనా.?

**జయ జయహే**

ఇజ్రాయెల్ లో సైనికులను ఉన్న అన్ని సెలవులను ఆ దేశ ఆర్మీ రద్దు చేసినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే సెలవుల్లో ఉన్న వారు వెంటనే తిరిగి సైన్యంలో చేరాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇజ్రాయెల్ మళ్లీ ఇరాన్‌పై కొత్త దాడులు ప్రారంభించనుందా అనే అనుమానం వ్యక్తమవుతోంది. ఇరాన్‌పై మొదటిసారి దాడులు చేపట్టడానికి కొన్ని గంటల ముందు కూడా ఆ దేశం సైనికులకు ఇటువంటి ప్రకటనే చేసింది. దీంతో ఇప్పుడు కూడా పెద్ద స్థాయిలో దాడులు చేపట్టడానికి ఆ దేశ సైన్యం సిద్ధమయ్యే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. యుద్ధం కారణంగా గగనతల రక్షణ వ్యవస్థల కొరత ఏర్పడుతుండడంతో.. దాడులను ఆపివేయాలని అమెరికా భావిస్తోంది. అయితే నెతన్యాహు మాత్రం యుద్ధం కొనసాగించడానికే మొగ్గు చూపుతున్నారని స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. అమెరికా సాయం లేకుండా సొంతంగా టెహ్రాన్‌పై విరుచుకుపడడానికి సైన్యం సన్నాహాలు కూడా ప్రారంభించినట్లు తెలిపాయి. ఇరాన్‌లోని కీలక నేతలు, ఐఆర్‌జీసీ అధికారులే లక్ష్యంగా దాడులు చేయడానికి ఇప్పటికే నెతన్యాహు సైనికాధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో యుద్ధం ముగింపు, గాజాలో దాడుల నిలుపుదల కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 15 పాయింట్ల ప్రణాళికను నెతన్యాహు వ్యతిరేకించారు. గాజా విషయంలో అగ్రరాజ్య ప్రతిపాదనలను అంగీకరించబోమని.. హమాస్ పూర్తిగా ఆయుధాలు విడిచిపెట్టేంతవరకు వెనక్కి తగ్గబోమని ప్రకటించారు

ఇజ్రాయెల్ మరోసారి తమపై దాడి చేస్తే.. తీవ్ర స్థాయిలో విరుచుకుపడతామని ఇరాన్ శనివారం హెచ్చరించింది. టెల్ అవీవ్‌లోని చమురు రిఫైనరీలు, కీలక కార్యాలయాలను లక్ష్యం చేసుకుంటామని పేర్కొంది. వ్యూహాత్మక హర్మూజ్ ప్రాంతం నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని అమెరికాకు సూచించింది. ఇరాన్‌పై యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని.. దాడుల కారణంగా జరిగిన నష్టానికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది.

# 8 మంది నిరాశ్రయులకు మొబైల్ ఆర్త జన సేవ

**శ్రీ సత్యసాయి బాబా దివ్య ఆశీస్సులతో యాత్ర**

**విశాఖపట్నం, ఆగస్టు 9, జయ జయహే :**





భగవాన్ శ్రీ సత్యసాయి బాబా దివ్య అనుగ్రహ ఆశీస్సులతో, స్వామివారి శతవర్ష జన్మదిన వేడుకల్లో భాగంగా విశాఖ నగరంలో చేపట్టిన పార్థి యాత్రలో ఒక చిన్న సేవా పుష్పంగా మొబైల్ అర్తజన సేవా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సింహాచలం, కే.వి.కే. సమితి యువత ఆధ్వర్యంలో పెందుర్తి పరిధిలోని చిన్న ముషిడివాడ, వేపగుంట జంక్షన్ ప్రాంతంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు పక్కన జీవనం సాగిస్తున్న 8 మంది నిరాశ్రయ నారాయణులను శుభ్రపరిచి, షేవింగ్ చేయించి, స్నానం చేయించి, నూతన వస్త్రాలను తొడిగి , అనంతరం టిఫిన్ అందించారు. ఆప్యాయతతో కూడిన ఈ సేవ ద్వారా వారి పట్ల గౌరవం, మానవత్వం, ప్రేమను చాటిచెప్పారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా బోధించిన “మానవ సేవే మాధవ సేవ” అనే సందేశాన్ని ఆచరణలో పెట్టే దిశగా ఈ కార్యక్రమాన్ని శ్రీ సత్య సాయి యువత నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా ఎడ్యుకేషన్ ఇన్‌చార్జ్ బగ్గం సతీష్ కూడా పాల్గొన్నారు . అలాగే సింహాచలం యూత్‌కు చెందిన 5 మంది, కే.వి.కే. సమితి యూత్‌కు చెందిన 7 మంది యూత్ ఉత్సాహంగా పాల్గొని తమ సేవలను అందించారు. “సేవ చేసే అవకాశం కల్పించిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబాకు హృదయపూర్వక కృతజ్ఞతలు” అని శ్రీ సత్య సాయి యువత తెలిపారు.



## నల్ల మిరియాలతో ఈ సమస్యలన్నీ దూరం

**నల్ల మిరియాలు.. చూడ్డానికి చిన్నగా ఉండే ఈ మిరియాల్లో ఎన్నో అద్భుత గుణాలున్నాయి. అవేంటో తెలుసుకోండి.**

వర్షాకాలం వచ్చిందంటే చాలు ఎన్నో ఆరోగ్య సమస్యలొస్తాయి. వీటి నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే డైట్‌లో కొన్ని యాడ్ చేసుకోవాలి. వీటి వల్ల ఈ సీజన్‌లో వచ్చే సీజనల్ సమస్యల్ని దూరం చేసుకోవచ్చు. అందులో భాగంగా మిరియాలని యాడ్ చేసుకోవడం వల్ల ఏ లాభాలున్నాయో తెలుసుకోండి.

**జీర్ణక్రియ..**
వర్షాకాలంలో అజీర్ణం, ఉబ్బరం, కడుపులో అసౌకర్యం, జీర్ణ సమస్యలు సర్వసాధారణం. నల్ల మిరియాలు కడుపులో హైడ్రోకోరిక్ యాసిడ్ స్రావాన్ని పెంచి జీర్ణక్రియని ప్రోత్సహిస్తుంది. ఇది ఆహారాన్ని విచ్ఛిన్నం చేసి పోషకాల శోషణని పెంచుతుంది. అదనంగా, నల్ల మిరియాలు కార్మినేటివ్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి ఆపానవాయువుని తగ్గిస్తుంది. ప్రేగు ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది.

**ఇన్ఫెక్షన్స్ నుండి రక్షణగా..**
వర్షాకాలంలో బ్యాక్టీరియా, వైరస్‌ల కారణంగా ఇన్ఫెక్షన్స్ సోకుతాయి. నల్ల మిరియాలు తీసుకుంటే యాంటీ మైక్రోబయల్ లక్షణాలు కలిగి ఉంటాయి. ఇవి వివిధ వ్యాధికారక కారకాల పెరుగుదలని నిరోధించగలవు. ఇది సహజ యాంటీ బయాటిక్‌గా పనిచేస్తుంది. హానికరమైన బ్యాక్టీరియా పెరుగుదలని నివారిస్తుంది. ఇన్ఫెక్షన్స్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. నల్ల మిరియాల కారణంగా సూక్ష్మజీవుల నుండి మనల్ని మనం కాపాడుకోవచ్చు.

**పోషకాల శోషణని..**
మనం శరీరంలో పోషకాల జీవ లభ్యతని పెంపొందించడంలో నల్ల మిరియాలు కీ రోల్ పోషిస్తుంది. ఇది పైపెరిన్ అనే సమ్మేళనాలని కలిగి ఉంటుంది. ఇది విటమిన్స్, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్స్ వంటి వివిధ పోషకాల శోషణని మెరుగుపరుస్తుంది. మీ భోజనంలో నల్ల మిరియాలని యాడ్ చేయడం వల్ల మన ఆరోగ్యానికి అవసరమైన పోషకాలను సమర్థవంతంగా గ్రహించేలా చేస్తుంది.


**జలుబు, జ్వరం..**
వర్షాకాలం వచ్చిందంటే చాలా మందికి జలుబు, జ్వరంతో బాధపడతారు. మిరియాలు తీసుకుంటే వీటన్నింటి నుంచి రిలీఫ్ ఉంటుంది. నల్ల మిరియాలను డైట్‌లో చేయడం, గోరువెచ్చని నీటిలో మిరియాల పొడి కలిపి తీసుకుంటే వీటి వల్ల రిలాక్సేషన్ ఉంటుంది.

**ఇమ్యూనిటీ..**
బ్లాక్ పెప్పర్‌లో రిచ్ యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ సిలు ఉంటాయి. ఇమ్యూనిటీని బూస్ట్ చేస్తాయి. వర్షాకాలంలో వీటిని తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్స్ దూరమవుతాయి. ఇది ఇమ్యూనిటిని బలంగా చేసి భయంకర ఆరోగ్య సమస్యల కారణంగా మనం బాధపడకుండా మనల్ని బలంగా చేస్తాయి.

**కీళ్ళ నొప్పులు..**
వర్షాకాలంలో కీళ్ళనొప్పులు, వాపులు వంటి వాపు సంబంధిత సమస్యలు తగ్గుతాయి. నల్ల మిరియాలని తీసుకుంటే శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. ఇందులో పైపెరిన్ మంటను తగ్గించి, నొప్పిని తగ్గిస్తుంది. మీ ఆహారంలో నల్ల మిరియాలని చేర్చితే మంటని ఎదుర్కోవడంలో, కీళ్ళ ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

# గుండె, కిడ్నీలపై ఎఫెక్ట్ చూపే హైబీపీ

## తగ్గేందుకు ఇలా చేయాల్సిందే



**గుండె సమస్యలు రావడానికి కారణాల్లో హైపర్ టెన్షన్ కూడా ఒకటి. అధిక రక్తపోటు కారణంగా గుండెపై ఎలాంటి ప్రభావం పడుతుంది. దీని వల్ల ఏయే సమస్యలొస్తాయి. వాటి నుంచి మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో తెలుసుకోండి.**

**హైపర్ టెన్షన్ అంటే..**
శరీరంలోని రక్తం స్పీడ్‌గా ధమనుల గోడలవైపు వెళ్తే హైపర్ టెన్షన్ అంటారు. హైపర్ టెన్షన్ అనేది రక్తనాళాల్లో ఒత్తిడిని పెంచుతుంది. ఇది 140/90mmHg లేదా అంతకంటే ఎక్కువగా ఉంటుంది. బీపి రీడింగ్ 140 దాటినప్పుడు అది హైబీపి అని చెప్పొచ్చు. దీనికి వయసు, తీసుకునే ఫుడ్, ఆల్కహాల్ తీసుకోవడం, పొగాకు వాడకం వంటి కారణాలు ఉంటాయి.

**రక్తపోటు తగ్గాలంటే ఎలా ఫుడ్ తీసుకోవాలి**
హైపర్ టెన్షన్ అనేది కేవలం గుండె సమస్యేనా.. గుండె జబ్బులు రావడానికి కారణాల్లో హైపర్ టెన్షన్ ఓ కారణం. అదే విధంగా, కేవలం గుండెకే ప్రమాదం కాదు. కిడ్నీలు కూడా ఎపెక్ట్ అవుతాయి. దీనికి కారణాలు ఏంటంటే..

బాడీలోని లిక్విడ్స్, ఎలక్ట్రోలైట్స్‌ని బ్యాలెన్స్ చేయడం ద్వారా బీపిని కంట్రోల్ చేయడంలో కిడ్నీలు కీ రోల్ పోషిస్తాయి.
కిడ్నీలు సరిగా పరిచేయకపోతే హైబీపి పెరుగుతుంది.
మూత్రపిండాలకి రక్తాన్ని సరఫరా చేసే ధమనులు ఇరుగ్గా మారిని హైబీపి వస్తుంది.
కిడ్నీల సమస్యలకి హైబీపి కారణమవుతుంది.
దెబ్బతిన్న కిడ్నీలు రక్తాన్ని సరిగ్గా ఫిల్టర్ చేయలేవు. దీని వల్ల ద్రవం నిలుపుదల, రక్తపోటు పెరుగుతుంది.
హైపర్ టెన్షన్ కారణంగా కిడ్నీలపై ఎఫెక్ట్ అయితే ఈ లక్షణాలు ఉంటాయి..
కాళ్ళు, చీలమండలు, పాదాల్లో వాపు ఉంటుంది.
మూత్రపిండాల సమస్యల కారణంగా ద్రవాలు నిలుస్తాయి.



మూత్రంలో నురగ వస్తుంది.
రాత్రుళ్ళు ఎక్కువగా మూత్రం వస్తుంటుంది.
మూత్రం ఎర్రని రంగులో వస్తుంటుంది.
అలసట, బలహీనంగా ఉంటాయి.
సమస్య తగ్గేందుకు..
సమస్య తగ్గేందుకు..

**గుండె, కిడ్నీలని కాపాడుకునేందుకు ఏం చేయాలంటే..**
రెగ్యులర్‌గా చెకప్ చేయించుకోవాలి. బీపిని చెక్‌చేస్తుండాలి.
కిడ్నీలు వ్యర్థాలను ఫిల్టర్ చేసేందుకు పుష్కలంగా నీరు తాగాలి.
బ్యాలెన్స్‌డ్ డైట్.. తక్కువగ సోడియం తీసుకోవాలి, పండ్లు కూరగాయలు, హోల్ గ్రెయిన్స్ ఎక్కువగా తీసుకోవాలి.
రెగ్యులర్‌గా వర్కౌట్ చేయాలి. హెల్దీ వెయిట్ మెంటెయిన్ చేయాలి.
ఆల్కహాల్, స్మోకింగ్‌ని తగ్గించాలి. ఈ రెండూ కూడా బీపి, కిడ్నీ సమస్యల్ని పెంచుతాయి.

**హైబీపి ఉంటే ఏం చేయాలి?**
ముందుగా సమస్య ఉందని గమనించినప్పుడు నెఫ్రాలజిస్ట్‌ని కలవండి.
ట్రీట్‌మెంట్ తీసుకుంటూ హెల్దీ డైట్, లైఫ్‌స్టైల్ చేంజెస్ చేయండి.
బీపిని చెక్ చేసుకోవాలి.
ఏ సమస్య ఉన్నా డాక్టర్‌కి తెలియజేయాలి.
సమస్యని తగ్గించుకునేందుకు డాక్టర్ ఇచ్చే సలహాలు తప్పకుండా పాటించాలి.
హైపర్ టెన్షన్ అనేది గుండె సమస్యలకంటే ప్రమాదకరం. దీని వల్ల కిడ్నీలు కూడా ఎఫెక్ట్ అవుతాయి. కాబట్టి, సమస్యని తగ్గించుకునేందుకు హెల్దీ డైట్ ఫాలో అవుతుంది. మంచి లైఫ్‌స్టైల్‌ని మెంటెయిన్ చేయాలి. కిడ్నీలను కూడా కాపాడుకునే ప్రయత్నం చేయండి.

# బరువు తగ్గాలంటే ఈ డైట్ ఫాలో అవ్వండి



ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్.. ఈ మధ్యకాలంలో బరువు తగ్గడానికి ఫుల్ పాపులర్ అయిన డైట్. దీనిని ఫాలో అవ్వడం వల్ల చాలా బెనిఫిట్స్ ఉన్నాయి. అలానే నెగెటీవ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి.
ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ విషయానికొస్తే ఏమి తినాలనే విషయంపై ఎలాంటి పరిమితులు తినాలి.. కానీ, ఎలా తినాలి, ఏ టైమ్‌లో తినాలనేదే ముఖ్యం. ఎక్కువగా షుగర్, ఉప్పు, ఫ్యాట్ ఫుడ్స్ తగ్గించాలి. పోషకాహారం తీసుకోవాలి.

**ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్..**
ఈ ఫాస్టింగ్ టైమ్‌లో మీరు కడుపు నిండే వరకూ తినొచ్చు. అదే విధంగా, ఈ ఆహారాన్ని తినే టైమింగ్స్ డిఫరెంట్‌గా ఉంటాయి. సాధారణంగా, 3 టైమింగ్స్ ఉంటాయి. అవేంటంటే..

**ప్రీ డయాబెటిక్ ఎందుకొస్తుంది..**
ఫాస్టింగ్ టైమింగ్స్.. 16/8 టైమింగ్.. రోజులోని 24 గంటల్లో మీకు వీలైన ఏవైనా 8 గంటలను సెలక్ట్ చేసుకోవాలి. ఆ ఎనిమిది గంటల్లో మీరు మీ రోజువారీ కేలరీల అవసరాల్లో మధ్యస్థంగా తినొచ్చు.

**టైమింగ్స్..**
ఆ ఎనిమిది గంటలు ఉదయం 7 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకూ, ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకూ, రాత్రి 8 నుండి తెల్లవారుజామున 2 గంటల వరకూ ఇలా ఎప్పుడైనా మీకు వీలైనట్లుగా ఫాలో అవ్వొచ్చు.
5 : 2 సార్లు వారానికి ఐదురోజులు మీరు ఈ ఫాస్టింగ్ ఫాలో అవ్వొచ్చు. కానీ, 500 నుంచి 600 కేలరీలు మాత్రమే రెండు రోజులు మాత్రమే తీసుకోవాలి.
ఈట్ స్టాప్ ఈట్ మెథడ్ .. వారానికి ఒకటి లేదా రెండు రోజులు ఏం తినొద్దు. వీలైతే 24 గంటలు ఫాస్టింగ్ ఉండాలి.

**గుండె ఆరోగ్యం..**
ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేయడం వల్ల రక్తపోటు, కొలెస్ట్రాల్ స్తాయిలు, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలు తగ్గి గుండె జబ్బులు కూడా తగ్గుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

**టైప్ 2 డయాబెటిస్..**
ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌తో టైప్ 2 డయాబెటిస్ తగ్గుతుంది.
దీని వల్ల గుండె ఆరోగ్యం మెరుగవుతుంది బ్రెయిన్ హెల్దీగా మారి శరీరానికి, మనస్సుకి తగిన విశ్రాంతి దొరుకుతుంది.
మానసిక ఆరోగ్యాన్ని, బ్రెయిన్ హెల్త్‌ని కాపాడుతుంది.
ఈ ఫాస్టింగ్ ఫాలో అయ్యే వరకూ క్యాన్సర్ వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**బరువు తగ్గడం..**
ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ ఫాలో అయ్యేటప్పుడు ఇది హార్డ్ కార్బోహైడ్రేట్స్‌ని విచ్ఛిన్నం చేస్తుంది. వాటిని గ్లూకోజ్‌గా మారుస్తుంది. శరీరం శక్తి కోసం ఉపయోగిస్తుంది. కాబట్టి, తక్కువ కేలరీలు తీసుకుంటే చాలు. కేలరీలు తగ్గినప్పుడు, శరీరంలోని గ్లూకోజ్ శక్తిగా మారుతుంది. దీని వల్ల శరీరంలోని అనవసర కొవ్వులు కరిగి బరువు తగ్గుతారు.

**నెగెటీవ్ ఎఫెక్ట్స్..**
ఈ డైట్ ఫాలో అయినప్పుడు మొదలుపెట్టినప్పుడు కొన్ని సమస్యలు ఉంటాయి. అవి..
ఆకలి
ఎక్కువగా తినాలనిపించడం
తలనొప్పిజి
అజీర్ణం
మూడ్ స్వింగ్స్
శక్తి తగ్గడం
అలసట
నోటి దుర్వాసన
నిద్ర సమస్యలు
డీహైడ్రేషన్‌జి
పోషకాహార లోపాలు

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com